Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 19.04.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 46 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



➤ తన ఆటలు సాగనందుకా?

➤ అను'కుల' అధికారులను సాగనంపినందుకా?

ఈసిపై...

# ఈ రు'బాబే'ంది?

*13 జిల్లాలు...*
*175 శాసనసభ స్థానాలు...*
*25 లోక్‌సభ స్థానాలు...*
*వేలాది గ్రామాలు...*
*46,120 పోలింగ్ బూత్‌లు...*
*లక్షల్లో ఎన్నికల సిబ్బంది...*
*3,93,45,717 మంది ఓటర్లు*
*అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ.*



ఒక ఆటోమొబైల్ కంపెనీ వంద కార్లు తయారు చేస్తే ఏదో ఒక కారులో స్టార్టింగ్ ప్రాబ్లమ్ రాకుండా ఉంటుందా? అలాంటిది 30 వేల ఈవిఎంలలో ఎన్నికల రోజున మొరాయించిన ఈవిఎంలు నాలుగొందలలోపే వున్నాయి. ఎలక్ట్రానిక్ పరికరాలంటేనే రిపేర్లు రాకుండా ఉంటాయా? అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియను అత్యంత అధునాతన టెక్నాలజీ ద్వారా నిర్వహించేటప్పుడు చిన్న చిన్న సమస్యలు తలెత్తకుండా వుంటాయా? ఒక ఊరిలోని డెయిరీబూత్‌లో కొన్ని హెరిటేజ్ డెయిరీ ప్యాకెట్‌లోని మజ్జిగ పులిసిపోయిందనుకుందాం... అంత మాత్రాన వారు ఉత్పత్తి చేసే మజ్జిగ ప్యాకెట్లన్నీ కూడా పులిసిపోయినట్లేనా? చిన్న చిన్న లోపాలను చూపి అసలు వ్యవస్థ మొత్తాన్నే నిందించడమన్నది ప్రజాస్వామ్యానికిచ్చే గౌరవం కాదు.

ఏప్రిల్ 11వ తేదీన ఏపి శాసనసభకు, 25 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలపై తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జాతీయ స్థాయిలో చేస్తున్న రాద్ధాంతం చూస్తున్నాం. ఆయన ఎన్నికల కమిషన్‌పై అక్కసు, ఆగ్రహం వెళ్ళగక్కుతున్నాడు. ఎన్నికలరోజున వందలాది ఈవిఎంలు పనిచేయలేదని, పొద్దున్నే పోలింగ్‌బూత్‌లకు భారీగా తరలివచ్చిన మహిళలు ఈవిఎంలు మొరాయించడంతో వెనక్కు వెళ్లిపోయారని, మొరాయించిన ఈవిఎంల స్థానాలలో

(మిగతా 11వ పేజీలో)



• గెలిచినా... ఓడినా...

# మహిళల మహిమే!

➤ పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి లాభం?

➤ తెలుగుదేశం ఆశలు అమ్మగార్లపైనే!

***ఏప్రిల్ 11వ తేదీన జరిగిన ఎన్నికలు రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక సంచలనానికి తెరతీయనున్నాయా? అనూహ్య ఫలితాలతో అద్భుతాలను ఆవిష్కరించనున్నాయా? మహామహులను ఖంగుతినిపించనున్నాయా? ఏమో ఏదైనా జరగొచ్చు. ఎన్నికలు జరిగిన తీరు అలా వుంది.***

ఈ ఎన్నికల్లో ప్రజలు మొక్కుబడిగా ఓట్లేయలేదు. ఓటు వేయడాన్ని ఒక పనిగా పెట్టుకోలేదు. ఓటు వేయడం ఒక బాధ్యత అనుకున్నారు.

(మిగతా 11వ పేజీలో)

శ్రీ గణేశాయ నమః

జై సాయిరామ్



జై శ్రీరామ్



శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల
వార్షికోత్సవ ఆహ్వానము
కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా.
స్వస్తిశ్రీ వికారినామ సంవత్సరం ఉత్తరాయణం చైత్ర మాసం కృష్ణ పక్షం సప్తమి శుక్రవారం తేది 26-04-2019 నుండి దశమి సోమవారం తేది 29-04-2019 వరకు
వార్షికోత్సవ కార్యక్రమములు జరుగును
విశేష కార్యక్రమ వివరములు

తేది 27-04-2019 శనివారం ఉ|| 11.00 గం||లకు
శ్రీ సాయినాథునికి కలశాభిషేకం

తేది 29-04-2019 సోమవారం ఉ|| 11.00 గం||లకు
శ్రీ యోగాంజనేయ స్వామివారికి కలశాభిషేకం

తేది 29-04-2019 సోమవారం సా|| 5.00 గం||ల నుండి
శ్రీ శ్రీరామ, సీతా, లక్ష్మణ, ఆంజనేయ
పరివార దేవతామూర్తుల ప్రాకారోత్సవం

ఈ విధముగా జరుగు కార్యక్రమములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి స్వామివార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది

గమనిక
అన్నప్రసాద వితరణ 26-04-2019 నుండి 29-04-2019 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12.00 గం||ల నుండి ప్రారంభం.

ఆహ్వానించువారు
శ్రీమతి శ్రీలత - కలికి కోదండరామిరెడ్డి
ధర్మకర్తలు

## సక్సెస్ స్టార్స్‌ని సత్కరించిన...

# యు.ఏ.ఇ సింహపురియన్స్

### "ఖైదీ" నిర్మాత-దర్శకులకు దుబాయ్‌లో సన్మానం





ఆ చిత్రం విడుదలై 36 సంవత్సరాలు. మెగాస్టార్ చిరంజీవి సినీ జీవితాన్ని మలుపు తిప్పి నటుడిగా ఆయనను అగ్రస్థాయికి చేర్చిన అరుదైన చిత్రం 'ఖైదీ'. చిత్ర నిర్మాత డా॥ యం.తిరుపతిరెడ్డిది నెల్లూరు, చిత్ర దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డిది నెల్లూరు. చిత్రంలో హీరోగా నటించిన చిరంజీవి సినీ నేపథ్యం మొదలైంది నెల్లూరు నుండి. ఇలా ముగ్గురు నెల్లూరీయులు కలిసి చేసిన అద్భుత ప్రయోగం 'ఖైదీ' సినిమా. ఆ సినిమా విడుదలై మూడున్నర దశాబ్దాలకు పైనే అయినా ఇప్పటికీ ఆ సినిమాకి అంత క్రేజ్ వుందంటే చిత్రాన్ని అంతటి స్థాయిలో రూపొందించడంలో ప్రతిభ కనపరిచిన దర్శక నిర్మాతలిద్దరూ ధన్యులే.

ప్రపంచవ్యాప్తంగా నెల్లూరీయులు ఎక్కడున్నా తమ వునికిని చెప్పకనే చెప్తారు. దుబాయ్‌లోనూ అంతే, అక్కడున్న నెల్లూరోళ్ళంతా ఒకటిగా చేరి యుఏఇ సింహపురీయన్స్ అనే సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి యేడాది ఓ నెల్లూరు ప్రముఖుడిని ఆహ్వానించి వార్షిక సదస్సును నిర్వహించుకుంటారు. ఆ సదస్సులో సదరు నెల్లూరీయుడిని అభిమానంగా సత్కరిస్తారు. గతంలో ఈ సత్కారాలను యస్.పి.బాలసుబ్రహ్మణ్యం సహా పలువురు నెల్లూరీయులు అందుకోగా ఈ ఏడాది ఖైదీ దర్శకనిర్మాతలు కోదండ రామిరెడ్డి, తిరుపతిరెడ్డిలు అందుకున్నారు.

ఏప్రియల్ 12వ తేదీ దుబాయ్‌లోని ఇండియా క్లబ్, క్రిస్టల్ లాంజ్ హాల్‌లో జరిగిన ఈ సంబరంలో దుబాయ్‌లో వున్న సుమారు 200మంది నెల్లూరీయులు సకుటుంబ సపరివారంగా పాల్గొని ఇద్దరు నెల్లూరు 'లెజండ్స్' తిరుపతిరెడ్డి, కోదండరామి రెడ్డిలను ఆప్యాయంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇన్నాళ్ళైనా, ఇన్నేళ్ళైనా తమను గుర్తుపెట్టుకుని ఇంత దూరం తమని ఆహ్వానించి ఆదరించి అభినం దించినందుకు దుబాయ్ నెల్లూరీయులందరికీ కోదండరామిరెడ్డి, తిరుపతిరెడ్డిలు ధన్యవాదాలు తెలిపారు. ఖండాంతరాలు దాటి వచ్చినా నెల్లూరు భాషను, నెల్లూరు యాసను మరువకుండా తమ జన్మభూమి నుండి ఘనత సాధించిన వారిని గుర్తించి దుబాయ్‌కి రప్పించి వారిని సత్కరించి పంపిస్తున్న యుఏఇ సింహపురీయన్స్‌ని ఈ ఇద్దరూ అభినందించారు. ఈ సందర్భంగా అచ్చిస్వాన్ వెంకట బచ్చు, సాకేత్ పట్వారి, పెండెకట్ల ఎస్వి శశాంక్, ప్రసాద్ రాజారావు, సురేష్ సాయి సుబ్రహ్మణ్యం, భాస్కరదత్త అనే బాలురు భగవద్గీత శ్లోకాలను ఎంతో అద్భుతంగా ఆలపించగా, మహ్మద్ షంషుద్దీన్ ఇస్లాం ప్రార్థన వినిపించారు. తల్లపనేని మాధవి తన చక్కటి వ్యాఖ్యానంతో ఆకట్టుకు న్నారు. అసోసియేషన్ ప్రతినిధులుగా గంగపట్నం ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, దువ్వూరు కిషోర్‌బాబు, సుంకు సాయిప్రకాష్, వాడి విజయ్‌కుమార్, గంజుల కిరణ్‌రెడ్డి, కడివేటి శ్రీధర్‌రెడ్డి, వి.భానుకుమార్, వెంకట సుబ్రహ్మణ్యం, చిన్ని యశోవర్ధన్, పివిన్ కుమార్, రాజశేఖర్, తల్లపనేని రాజు, నరేంద్ర, కిషోర్, సందీప్, తులసి వెంకటప్రసాద్, కె.వెంకట్, రమేష్‌రెడ్డి, సాగర్‌లు ఈ సమావేశాన్ని పర్యవేక్షించి విందు వినోదాలతో ఆత్మీయ వేడుకగా కార్యక్రమాన్ని నిర్వహించి అందరికీ ఆనందాన్ని పంచారు.

## 'స్లిప్' అయ్యామా?

### ఆత్మకూరులో వివిప్యాట్ స్లిప్‌ల వివాదం



ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వివిప్యాట్ స్లిప్‌లు బహిరంగంగా పడివుండడం సంచలనంగా మారింది. 15వ తేదీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వివిప్యాట్ స్లిప్పులను కనుగొన్నారు. ఇవి 134 నెంబర్ పోలింగ్ బూత్‌విగా గుర్తించారు. పోలింగ్‌కు ముందు ఈవిఎంల పనితీరు పరిశీలించడానికి మాక్ పోలింగ్‌ను నిర్వ హిస్తారు. మాక్ పోలింగ్‌లో వచ్చిన వివిప్యాట్ స్లిప్పులను అధికారులు అప్పుడే కాల్చేసెయ్యాలి. అయితే ఈ బూత్‌లో అలా జరిగినట్లు లేదు. ఎన్నికలైన నాలుగురోజుల తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవ రణలో ఇవి బయటపడ్డాయి. పోలింగ్ సిబ్బంది నిర్వాకం వల్లే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు సీరియస్సై విచారణకు ఆదేశించారు.

## చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న ఎల్ఐసి డివిజన్ కార్యాలయం వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) ఆధ్వర్యంలో ఈనెల 14న చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఐసిఇయు జనరల్ సెక్రటరీ నగేష్, నాయకులు ప్రసాద్, శర్మ, జగదీశ్వరి పాల్గొన్నారు.

## కొత్తూరు ఆలయాల్లో...

# 26 నుంచి వార్షికోత్సవ వేడుకలు

**27న శ్రీసాయినాధునికి, 29న శ్రీ యోగాంజనేయస్వామికి కలశాభిషేకాలు**





ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో అత్యద్భుతమైన రీతిలో.. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా నిర్మించి ఉన్న శ్రీ షిరిడి సాయి బాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామివార్ల దేవస్థానాల వార్షికోత్సవ వేడుకలు ఈనెల 26 నుంచి 29వ తేది వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఆ మేరకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 27వ తేది ఉదయం 11 గంటలకు శ్రీ సాయినాధునికి కలశాభిషేకం, 29వ తేది ఉదయం 11 గంటలకు శ్రీ యోగాంజనేయస్వామివారికి కలశాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటల నుంచి శ్రీ శ్రీరామ, సీతా, లక్ష్మణ, ఆంజనేయ పరివార దేవతామూర్తుల ప్రాకారోత్సవాన్ని కూడా మరింత వైభవంగా నిర్వహిస్తారు. ఈ దేవస్థానాల ధర్మకర్తలైన ప్రముఖ వదాన్యులు శ్రీమతి శ్రీలత– కలికి కోదండరామిరెడ్డిల నేతృత్వంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాలతో కొత్తూరు గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళ లాడనుంది. అంగరంగ వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ధర్మకర్తలు కోరుతున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26 నుంచి 29వ తేది వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరుగుతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# దీనజన బాంధవుడు.. అంబేద్కర్

### - సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి

బడుగు బలహీనవర్గాలకు చెందిన దీనజనుల బాంధవుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వైయస్సార్ కాంగ్రెస్ నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియా డారు. డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా పొదల కూరులోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కాకాణి పాల్గొని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలంతా శాంతి యుతంగా జీవిస్తున్నారన్నారు. అంబేద్కర్ తన అద్వితీయమైన మేధాశక్తితో దేశ సంక్షేమం కోసం రాజ్యాంగం రచించి దేశప్రజల హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో బహుజనసేవాసమితి గౌరవాధ్య క్షుడు డాక్టర్ టి. శ్రీహరి, ఎంపిపి కోనం చినబ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ పి.ఓ బొడ్డు ప్రసాద్, ఎంపిటిసిలు ఏనుగ శశిధర్‌రెడ్డి, గార్ల పెంచలయ్య, వైయస్సార్సీపి మండ లాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.లక్ష్మీనారా యణ, బిసి ఎంప్లాయిస్ అధ్యక్షుడు వై.మస్తాన్‌రావు, బహుజన సేవాసమితి నాయకులు ఎస్‌వి రత్నం పాల్గొన్నారు.

# పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి

### - మాగుంట శరత్‌చంద్రారెడ్డి

పేదలకు సాయం చేయడంతోనే తన కెంతో సంతృప్తి కలుగుతుందని సమాజ సేవాభిలాషి, మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) అన్నారు. ఈ నెల 15న ఆయన జన్మదిన వేడుకల్లో భాగంగా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దాదాపు 500 మందికి అన్నదానం నిర్వహించారు. తొలుత నెల్లూరు రెడ్‌క్రాస్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు దేవుడు ఇచ్చిన దాంట్లో కొంత పేదలకు సహాయం చేయడంలో తనకెంతో ఆనందం ఉందన్నాడు. అందరూ 'మన ఊరు – మన బాధ్యత'గా పేద ప్రజలకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. ఆరుగుంట రమేష్‌రెడ్డి, నారపరెడ్డి యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి



# గెలుపు పిలుపు ఎవరికి?



- ఫ్యాన్ స్పీడ్‌పై ఆశలు పెట్టుకున్న ఏపిఆర్
- సొంతంగానే గెలుస్తాననే నమ్మకంతో బిఎంఆర్

తెలుగుదేశం పార్టీ పెట్టాక 36ఏళ్ళ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే నెల్లూరు పార్లమెంట్ నుండి తెలుగుదేశం పార్టీ గెలిచింది రెండే రెండు సార్లు! 1985లో పుచ్చలపల్లి పెంచలయ్య, 1999లో వాజ్‌పేయి సానుభూతి గాలిలో ఉక్కాల రాజేశ్వరమ్మలు విజయం సాధించారు. 9సార్లు నెల్లూరు లోక్‌సభ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులు ఓడిపోయారు. అంటే ఒకరకంగా చూస్తే ఒకప్పుడు కాంగ్రెస్‌కు, ఇప్పుడు దాని స్థానంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి నెల్లూరు పార్లమెంట్‌ను కంచుకోటగా చెప్పుకోవచ్చు.

ఈ ఎన్నికల్లోనూ సరైన అభ్యర్థి లేక తెలుగుదేశం వాళ్ళు చివరివరకు వెదికారు. చివరకు తప్పని పరిస్థితుల్లో బలహీన వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్త బీద మస్తాన్‌రావును అభ్యర్థిగా నిలబెట్టారు. కావలి అసెంబ్లీ నుండి పోటీ చేయడానికి ఆసక్తి చూపిన ఆయన నెల్లూరు పార్లమెంట్ నుండి అయిష్టంగానే పోటీ చేసినట్లు తెలుస్తోంది.

అయితే, జిల్లాలో పోలింగ్ నాటి ముందు వాతావరణాన్ని బట్టయితే నెల్లూరు పార్లమెంట్ నుండి వైసిపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలి, కాని ఎన్నికల రోజుకు పరిస్థితులు మారాయని బిఎంఆర్, ఏపిఆర్‌ల మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లుగా జరిగిందని, ఎవరు గెలిచినా చాలా తక్కువ మెజార్టీతో నేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## బిఎంఆర్ శిబిరం అంచనా!

లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీలలో మెజార్టీ స్థానాలు వైసిపి గెలిచినా పార్లమెంటులో మాత్రం తమదే విజయమని బిఎంఆర్ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనికి వాళ్ళు చెబుతున్న కారణాలు చాలావున్నాయి. అందులో మొదటిది క్రాస్ ఓటింగ్. నెల్లూరు లోక్‌సభ పరిధిలోని యాదవ సామాజికవర్గం ఓటర్లంతా గంపగుత్తగా బిఎంఆర్‌కే వేసారని చెబుతున్నారు. అది జరిగి వుండొచ్చు కూడా! ఇక బీద మస్తాన్‌రావు వ్యక్తిగత పరిచయాలు, ఆయన వ్యక్తిత్వం చాలామంది వైసిపి నాయకులు, కార్యకర్తలను కూడా పార్లమెంట్ ఓటింగ్ విషయంలో బిఎంఆర్ వైపు మొగ్గుచూపేలా చేసిందంటున్నారు. అలాగే బిఎంఆర్ అసెంబ్లీ అభ్యర్థులతో పనిలేకుండా పార్లమెంట్ అభ్యర్థిగా సొంతంగా ఎలక్షన్ చేసుకున్నాడు. డబ్బు ఖర్చుపెట్టాడు. నెల్లూరురూరల్, నెల్లూరు నగరంతో పాటు కావలిలో బిఎంఆర్‌కు అనుకూలంగా భారీఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందని, వైసిపి ఆశలు పెట్టుకున్న నియోజకవర్గాలలో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచినా పెద్ద మెజార్టీలు రావన్నది బిఎంఆర్ వర్గీయుల ధీమా! టిడిపి అభ్యర్థిగా ప్రచారం మొదలుపెట్టాక ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలో చేరాడని, ప్రజల్లో దీనిపై వ్యతిరేకత వచ్చిందని ఇది కూడా తమకు ఓటుగా మారిందని బీద అనుచరుల నమ్మకం. అయితే బిఎంఆర్ ఏ స్థానంలో పోటీ చేసినా గెలవడం ఆయన కుటుంబంలోనే కొందరికి ఇష్టం లేదని, కాబట్టే ఆయన ఎక్కడ నిలబడినా ఆయన గెలుపును అడ్డుకునే ప్రయత్నం ఆయన పక్కనే వున్న కుటుంబసభ్యులే చేస్తారనే అభిప్రాయం చాలామందిలో వినపడుతోంది. ఈ తరుణంలో ఆయన గెలిచే పరిస్థితి అనుమానాస్పదమే!?

## ఆదాలలో సడలని ధైర్యం

ఎంత క్రాస్‌ఓటింగ్ జరిగినా, ఎన్ని పరిణామాలు సంభవించినా మెజార్టీ తగ్గొచ్చేమోగాని గెలుపుకు ఢోకాలేదని ఆదాల వర్గీయులు ధీమాగా వున్నారు. క్రాస్ ఓటింగ్ అన్నది ఎక్కువుగా యాదవ సామాజిక వర్గంలోనే జరుగుతుందని, సహజంగా మెజార్టీ యాదవులు 1983 నుండి కూడా తెలుగుదేశంకు అండగానే వుంటున్నారని, వాళ్ళ ఓట్లు వాళ్ళ పార్టీ అభ్యర్థికే పడడంలో క్రాస్ ఓటింగ్ అన్నది ఏముందని వైసిపి వర్గీయుల అభిప్రాయం. వైసిపిలో వున్న యాదవులు క్రాస్ ఓటు వేసినా పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని, చాలాచోట్ల అసెంబ్లీలో తెలుగుదేశానికి వేసినవాళ్ళు పార్లమెంటులో ఫ్యాన్‌కు వేశారని, నెల్లూరురూరల్, కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో వైసిపి పార్లమెంట్ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ ఎక్కువుగా జరిగిందని భావిస్తున్నారు. ఇవన్నీ తీసి పక్కనపెడితే రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా వుందని, జగన్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలన్న ప్రజల నిర్ణయంతో గెలుపు ఖాయమంటున్నారు. 2014లో సిటింగ్ ఎమ్మెల్యే కాబట్టి మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై వ్యతిరేకత పని చేసిందని, ఆదాల సిటింగ్ ఎంపీ కాదని, ఆయనపై వ్యతిరేకతకు అవకాశం లేదని, నిన్నటిదాకా తెలుగుదేశంలో వున్నాడు కాబట్టి ఆ పరిచయాలతో తెలుగుదేశంలోని కొందరు ఆదాలకు సహకరించారని అంటున్నారు. ఏతావాతా వీళ్ళందరూ చెప్పేదేంటంటే బిఎంఆర్‌కు ఎంత క్రాస్ ఓటింగ్ జరిగినా తమ మెజార్టీ తగ్గొచ్చేమోగాని గెలుపును ఆపలేరని ఆదాల అనుచరులు భావిస్తున్నారు. ఒకవేళ తెలుగుదేశం ప్రభంజనం వచ్చి, అసెంబ్లీ సీట్లలో కూడా ఆ పార్టీ అభ్యర్థులే గెలిస్తే ఇక పార్లమెంట్ పోవడంలో ఆశ్చర్యం వుండదని అభిప్రాయపడుతున్నారు.

## 23న శ్రీసిటికి ఉప రాష్ట్రపతి రాక



శ్రీసిటి సెజ్‌లోని ట్రిపుల్ ఐటీలో ఈనెల 23న జరిగే ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు రానున్నారు. 23వ తేది ఉపరాష్ట్రపతి చెన్నై నుండి బయలుదేరి ఉదయం 9.30గంటలకు తడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుండి శ్రీసిటిలోని ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని అనంతరం మధ్యాహ్నం చెన్నై చేరుకుంటారని సమాచారం.




## 'ప్రభా'తం

# 'ఆధార్' భద్రమేనా?

**ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో ఉన్న ఆధార్ డేటా ఇటీవల చౌర్యానికి గురికావడం అటు తెలంగాణాలోనూ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రజల్లోనూ సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఆధార్ సమాచారం బయటకు పొక్కడం ప్రజల భద్రతకు.. దేశభద్రతకు ఎంతైనా ప్రమాదకరం. ప్రజలకు సంబంధించిన ఆధార్ డేటా అత్యంత గోప్యంగా ఉండాలి. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఆధార్ డేటా చోరీకి పాల్పడిన అక్రమార్కులందరినీ వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలి.**

ఆధార్ డేటాకు కట్టుదిట్టమైన భద్రత ఉందని, అది బహిర్గతమయ్యే ప్రసక్తే లేదని విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యుఐడిఏఐ) గతంలో వాదించిన విషయం అందరికీ తెలిసిందే. ఆ సంస్థ సుప్రీం కోర్టులోనూ అప్పట్లో ఇదే వాదన వినిపించింది కూడా. అయితే అదంతా గతం. ఇప్పుడు ఆ ప్రాధికార సంస్థే తమ డేటా చోరీకి గురైందని గగ్గోలు పెడుతూ పోలీసులకు తాజాగా ఫిర్యాదు చేసిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో తేటతెల్లమవుతోంది. దీంతో, ఐటీ గ్రిడ్స్ సంస్థ దెబ్బకు మన డేటా భద్రత అంతా హుష్‌కాకీ అయిపోయినట్లేనా అని సర్వత్రా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అందులోనూ ప్రజలకు సంబంధించిన.. వారి వ్యక్తిగత వివరాలతో కూడిన.. ఎంతో ముఖ్యమైన ఆధార్ డేటా చౌర్యానికి గురికావడం దారుణం. ఈ డేటా చౌర్యంతో అటు తెలంగాణాలోనూ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రజల్లోనూ సర్వత్రా ఆందోళన పెల్లుబుకుతోంది. ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో ఉన్న ఆధార్ డేటా అత్యంత గోప్యంగా ఉండాలి. కానీ, అంతటి ముఖ్యమైన సమాచారాన్ని ఒక ప్రైవేటు ఏజెన్సీ దొంగిలించి దాన్ని తెలుగుదేశం కార్యకర్తల ఫోన్లలో సేవామిత్ర యాప్ కింద లభ్యమయ్యే విధంగా ఏర్పాటు చేశారన్న విషయం ప్రజలను మరింతగా ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి అక్రమాలకు పాల్పడడాన్ని ఏమనుకోవాలి?.. దీంతో, ప్రజల భద్రత నేతిబీరకాయలో నేయిలాగానే తయారైందనుకోవాలా?.. అందులోనూ ఇది కేవలం ఒక రాష్ట్రానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. తెలంగాణ ప్రజల ఆధార్ డేటా కూడా ఐటీ గ్రిడ్స్ వద్ద ఉందనే విషయం అధికారుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. తెలంగాణ పోలీసులకు అధార్ ప్రాధికార సంస్థ డిప్యూటి డైరెక్టర్ టి. భవానీప్రసాద్ చేసిన ఫిర్యాదు మేరకు సిట్ అధికారులు రంగంలోకి దిగి ఈ డేటాచోరీ వ్యవహారంపై దృష్టి సారించారు. దీంతో తీగ లాగితే డొంకంతా కదిలినట్లయింది. తెలుగుదేశం పార్టీ సేవామిత్ర యాప్‌ను నిర్వహిస్తున్న ఐటీ గ్రిడ్స్ ప్రైవేట్ సంస్థ ఈ డేటాస్కామ్‌కు తెరతీసిందన్న నేపథ్యంలో, ఆధార్ డేటా చోరీ నిజమేనంటూ ఆధార్ డిప్యూటి డైరెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు మరో కీలకమలుపు తిరిగినట్లయింది. ఆంధ్ర, తెలంగాణ ప్రజల ఆధార్ డేటాను అక్రమంగా విదేశాలకు చెందిన సర్వీసెస్‌లో స్టోర్ చేశారని, ఈ సున్నితమైన డేటా అంతర్జాతీయ నేరగాళ్ళ చేతిలో పడితే దేశభద్రతకే ముప్పని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొనడం గమనించదగినది. అయినా, ప్రజల వ్యక్తిగత వివరాల సమాచారాన్ని గోప్యంగా..ఎంతో భద్రంగా ఉంచాల్సిన ప్రభుత్వమే వాటినంతా ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఇక వ్యక్తిగత సమాచారానికి రక్షణ ఎక్కడుంటుందన్నది అందరి ప్రశ్న. ఒకవేళ ఇలాంటి డేటాలు శత్రుదేశాల చేతికి చిక్కితే అది దేశభద్రతకే ముప్పు అనే ఆందోళన మరికొందరిది. ఐటి గ్రిడ్స్ అనే సంస్థ ఈ డేటా చౌర్యానికి పాల్పడినట్లు తెలుస్తోందని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కూడా ఇటీవల ధృవీకరించింది. అయితే ఈ సమాచారమంతా ఆ కంపెనీ నుంచి మరెక్కడికైనా షేర్ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు తెలంగాణకు చెందిన సిట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. దేశపౌరుల వ్యక్తిగత సమాచారాన్ని విదేశాలకు చెందిన క్లౌడ్ సర్వీసుల్లో స్టోర్ చేయడం చట్టవిరుద్ధమని, దీనివల్ల జాతీయభద్రతకు ముప్పుగా పరిణమించే ప్రమాదం లేకపోలేదని అధికారులు భావిస్తున్నారు కూడా. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మూడున్నర కోట్ల మంది ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి దాన్ని తెలుగుదేశం కార్యకర్తల ఫోన్లలో సేవామిత్ర యాప్ కింద లభ్యమయ్యేవిధంగా ఏర్పాటుచేశారని, కేంద్ర ఎన్నికల సంఘం వద్ద మాత్రమే ఉండాల్సిన ఓటర్ల కలర్‌ఫోటోలతో కూడిన జాబితా, ఇటు ఆధార్ డేటాను అనుసంధానించి దీన్ని రూపొందించారన్నది ఈ వ్యవహారంలోని కీలక అంశం. పౌరుల ఆధార్ ఐడిని టిడిపి సేవామిత్ర యాప్‌కోసం లింక్ చేయడం జాతీయ భద్రతకు ఎంతైనా ప్రమాదకరమన్నది ప్రముఖుల అభిప్రాయం. ఇదంతా చంద్రబాబునాయుడు ప్రభుత్వ ప్రాపకంతో ఆయన తన పార్టీ ప్రయోజనం కోసం వెలగబెట్టిన నిర్వాకాలేనని విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రజల డేటాయే కాదు, తెలంగాణ ప్రజల డేటా కూడా డేటాచోరీదారుల చేతుల్లో పడిందని, ఈ రెండు రాష్ట్రాల ప్రజలకు సంబంధించిన 18 రకాల వ్యక్తిగత సమాచారం సేవామిత్రలో భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం కార్యకర్తల సెల్‌ఫోన్లకు అందుబాటులో ఉండేలా చేశారని అంతా గగ్గోలుగా ఉంది. అయితే, దీన్ని రూపొందించిన ఐటీ గ్రిడ్స్ సంస్థ సిఇఓ అశోక్ ఆచూకీ మాత్రం దొరకడం లేదు. డేటా చోరీ కేసులో ప్రధాన నిందితుడైన అశోక్‌ను అరెస్ట్ చేసేందుకు తెలంగాణ పోలీసులు పెద్దఎత్తున రంగంలోకి దిగినట్లు సమాచారం.

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని ఐటి గ్రిడ్ సంస్థ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లను తొలుత విశ్లేషించి చూస్తే, వీటిలో పెద్ద మొత్తంలో ఆధార్ సమాచారం ఉన్నట్లు తెలుస్తోందని, అయితే ఇంకా పూర్తిస్థాయి విశ్లేషణ చేయాల్సి ఉందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అంతేకాదు, కేవలం ఏపి, తెలంగాణాలతో పాటు పలు ఇతర రాష్ట్రాల సమాచారం కూడా ఐటి గ్రిడ్ వద్ద ఉన్నట్లు తెలుస్తోందని ఆయా వర్గాలు చెప్తున్నాయి. ఏదేమైనా ఆధార్ సమాచారం బయటకు పొక్కడం దేశభద్రతకే సవాల్‌గా పరిణమిస్తుందనే అభిప్రాయాలను ఎవరూ కాదనలేరు. ఎందుకంటే అత్యంత గోప్యంగా ఉండాల్సిన ప్రజల వ్యక్తిగత వివరాలు బట్టబయలవుతుండడం ఎంతైనా విచారకరం. సేవామిత్ర యాప్‌లో రెండు రాష్ట్రాలకు చెందిన ఆధార్ డేటా, ఓటర్ల జాబితాలున్నాయని, తమకు ఓటు వేయరని అనుమానం వచ్చిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు కూడా ఈ యాప్ ద్వారా అవకాశం ఉందనే అనుమానాలూ లేకపోలేదు.

మొత్తంగా ఈ డేటా చౌర్యాన్ని పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఈ అక్రమాల్లో ఎవరెవరు ఏ మేరకు భాగస్వాములుగా ఉన్నారో నిష్పాక్షికంగా వెలికితీసి, అక్రమార్కులందరినీ కఠినంగా శిక్షించకుంటే సమాజంలో ఇలాంటి నేరాలు ఘోరాలకు అంతే ఉండదు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు.. ప్రజల భద్రతకు...దేశభద్రతకు కూడా రక్షణే ఉండదు!...

# గీతాంజలిలో జాతీయ సాంకేతిక సదస్సు



'కళాకౌశల్' మేగజైన్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈనెల 13న 'సృజన-2కె19' జాతీయ సాంకేతిక సదస్సు జరిగింది. కళాశాలలోని ఎస్‌అండ్‌హెచ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి సాంకేతిక సదస్సుల్లో క్రమం తప్పకుండా పాల్గొనడం ద్వారా తమ సృజనాత్మక ప్రతిభను మెరుగుపరచుకోగలరని, విద్యార్థులు పట్టుబట్టి మార్కులు సాధించే యాంత్రికమైన విద్యావిధానానికి స్వస్తి చెప్పి, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ ఇంజనీరింగ్ విద్యార్థులకు పారిశ్రామిక అవగాహనను పెంపొందించడానికి ఈ సాంకేతిక సదస్సు ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై గట్టి పట్టు సాధించాలని, ఇతర ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉపాధి నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయని, క్రమంగా సాంకేతిక విద్య క్లిష్టతరమవుతున్నదని, ప్రభుత్వాలు విద్యార్థులను మంచి పారిశ్రామికవేత్తలుగా, వాణిజ్య వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నదని, ఈ అవకాశాన్ని నేటి తరం ఇంజనీరింగ్ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల మేగజైన్ 'కళాకౌశల్'ను ఆవిష్కరించారు. పేపర్ ప్రెజెంటేషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్ రంగంలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌అండ్‌హెచ్ విభాగాధిపతి శ్రీమతి సిహెచ్ కల్యాణి, కో-కన్వీనర్ ఎం.గణపతి, కళాశాల డైరెక్టర్ టిఎల్‌విఎల్‌ఎన్ కుమార్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా పుత్రకామేష్టి యాగం

నెల్లూరు బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి 38 వ వార్షికోత్సవం సందర్భంగా పుత్ర కామేష్టి యాగం ఈనెల 13న నేత్రపర్వంగా జరిగింది. కుర్తాళం సిద్ధేశ్వరానంద భారతి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ మాచవోలు కోటేశ్వర శర్మ, మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 210 మంది దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. మందిర కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.




### ప్రజాగ్రహానికి ఉదాహరణ
## కోడెల సంఘటన

అసెంబ్లీ స్పీకర్ అన్నది ఒక గౌరవప్రదమైన పదవి. ఆ పదవిలో ఉన్నోళ్ళు దాని గౌరవాన్ని కాపాడాలి. అయిదేళ్ళు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన కోడెల శివప్రసాద్‌రావు ఆ పదవికున్న గౌరవాన్ని దిగజార్చారు. ఏరోజూ ఆయన స్పీకర్ పదవిలో హుందాగా వ్యవహరించలేదు. రాజ్యాంగ విలువలను దిగజార్చారు. స్పీకర్ స్థానంలోనూ ఒక రాజకీయ నాయకుడిగా ప్రవర్తించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అరాచకాలకు అడ్డాగా మలిచారు. ప్రజలను వేధించుకు తిన్నారు. కోడెల కొడుకు ఈ నియోజకవర్గంలో ఒక నియంతలా వ్యవహరించాడు. స్థానిక ప్రజల్లో గత ఐదేళ్ళుగా ఆయనపై పెరిగిన కోపం మొన్న పోలింగ్ రోజున ఇనిమెట్ల గ్రామంలో బయటపడింది. పోలింగ్‌బూత్‌లోకి వెళ్లి రిగ్గింగ్ చేయాలని చూసిన కోడెలను స్థానికులు ఉతికి ఆరేశారు. విర్రవీగే ఏ నాయకుడికైనా ఏదో ఒకరోజు ఇలాంటి గతే పడుతుంది.

**– సి.నరేష్‌గౌడ్, నరసారావుపేట.**

## రాజకీయాలు మర్చిపోండి

రాష్ట్రంలో ఎన్నికలు ముగిసాయి. అందరూ టెన్షన్ నుండి రిలీవ్ కావాలి. ఫలితాలు ఒక పార్టీకి అనుకూలం.. ఇంకో పార్టీకి వ్యతిరేకం కావచ్చు. కాని, ప్రజలు ఇక్కడితో రాజకీయాలు మరచిపోవాలి. అయిదేళ్ళకోసారి వచ్చే ఎన్నికల కోసం ప్రజలు ఒకరికొకరు శత్రువులుగా మారాల్సిన అవసరం లేదు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి... నాయకులు వస్తుంటారు, పోతుంటారు. బంధాలు, బంధుత్వాలు శాశ్వతం. రాజకీయాలను అందరూ ఇక్కడితో వదిలేయండి.

**డి.సంజీవరావు, నెల్లూరు.**

## ఈ డ్రామాలేంటి బాబు

చంద్రబాబునాయుడు ఓ పక్క మే 23వ తేదీ తర్వాత మంచిరోజు చూసుకుని ప్రమాణస్వీకారం చేస్తానంటున్నాడు. 130సీట్లు వస్తాయంటున్నాడు. ఇంకోపక్క మాత్రం ఎన్నికలు కమిషన్ సక్రమంగా ఎన్నికలు నిర్వహించలేదని, ఈవిఎంలలో ట్యాంపరింగ్ జరిగిందని గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల నిర్వహణ అన్నాక చిన్నచిన్న లోపాలు సహజమే! ఎన్నికలు సక్రమంగా నిర్వహించకపోతే 80శాతం పోలింగ్ జరుగుతుందా? ఆయన తనకు 130సీట్లు వస్తాయని చెప్పుకుంటున్నాడు. ఈవిఎంల ట్యాంపరింగ్ జరిగితే మరి అన్ని సీట్లు ఆయనకెందు కొస్తాయి. 2014లో కూడా ఈవిఎంల ద్వారానే ఎన్నికలు జరిగాయి. అప్పుడు తెలుగుదేశమే గెలిచింది. మరి అప్పుడు చంద్రబాబు ఈవిఎంలను ట్యాంపరింగ్ చేసే గెలిచాడా?

**జూపల్లి వాసుదేవరావు, నెల్లూరు.**

# ఎవరి లెక్కల్లో వాళ్ళు!

- అంచనాలలో తలమునకలైన అభ్యర్థులు
- పోలింగ్‌పై జోరుగా సాగుతున్న విశ్లేషణలు

**లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. ఒక అంకం పూర్తయినట్లయ్యింది. పెళ్లి జరిగాక 40రోజుల తర్వాత శోభనానికి ముహూర్తం పెట్టినట్లుగా మే 23వ తేదీన కౌంటింగ్ పెట్టారు. పోటీలో వున్న అభ్యర్థులకే కాదు, ఆయా పార్టీల అభిమానులకు కూడా అప్పటివరకు టెన్షనే! కౌంటింగ్‌కు చాలా గడువు రావడంతో నియోజకవర్గాల వారీగా గెలుపోటములపై విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఈ విశ్లేషణలు ఎవరికి అనుకూలంగా వాళ్ళు ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు.**



## • నెల్లూరు నగరం



### మహిళా లోకం తోడుంటుందని ఒకరు

### యువత వెంటుంటుందని మరొకరు

టిడిపి అభ్యర్థి మంత్రి పి.నారాయణ చూస్తే గత రెండేళ్ళలో నియోజకవర్గంలో తాను వేసిన సిమెంట్‌రోడ్లు, అభివృద్ధి చేసిన పార్కులు, ఎన్టీఆర్ ఇళ్ళు అలాగే పసుపు-కుంకుమ, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు తనను గెలిపిస్తాయనే నమ్మకంతో వున్నాడు. కుల ఓటు బ్యాంకును నమ్ముకుని వున్నాడు. అయితే ఎన్నికల నిర్వహణలో పార్టీ కేడర్ పూర్తిగా సహకరించలేదని తెలుస్తోంది. నారాయణ భారీ ఎత్తునే ఖర్చు పెట్టాడు. అయితే అది ఓటర్లకు సక్రమంగా చేరలేదనే ఆరోపణలున్నాయి. నారాయణ ఎన్నికల కోసం తన సిబ్బందిని నమ్ముకున్నారని, వాళ్ళు అనుభవం లేక సరిగా చేయలేకపోయారని, అదే సమయంలో టిడిపి స్థానిక నాయకులను కూడా పూర్తిగా నమ్మకపోవడంతో వాళ్లు ఎన్నికల్లో అంతగా పూసుకోలేదని తెలుస్తోంది.

వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్ చూస్తే ఎన్నికల నిర్వహణ చాలా చక్కగా చేసుకున్నాడు. డివిజన్‌ల వారీగా కేడర్‌ను లీడర్‌లను పటిష్టం చేసుకున్నారు. 2014 ఎన్నికల్లో ఇతర పార్టీలలో వున్న నాయకులను కూడా దగ్గర చేసుకున్నాడు. పోల్ మేనేజ్‌మెంట్‌ను సమర్ధవంతంగా నిర్వర్తించారు. ఎన్నికలకు ఆరురోజుల ముందు నెల్లూరు నగరంలో నిర్వహించిన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సభ కూడా అనిల్‌కు బాగా కలిసొచ్చింది. ఆ సభలో జగన్ ఎన్టీఆర్ ఇళ్ళపై వున్న ఋణాన్ని మాఫీ చేస్తానని చెప్పడంతో పాటు డ్వాక్రా మహిళల ఋణాలను కూడా ప్రస్తావించడం మహిళల అభిమానాన్ని చూరగొంది. నెల్లూరు సిటిలో యువతరం ఎక్కువగా వుండడం కూడా అనిల్‌కు కలిసొచ్చే అంశం. గతంలో ఎప్పుడూ తెలుగుదేశంకు గట్టి మద్దతుదారులుగా వుండే బ్రాహ్మణులు ఈసారి వైసిపికి అండగా నిలిచారని, అలాగే ఆర్యవైశ్యుల్లో సైతం సగం మందికిపైనే వైసిపి వైపు మొగ్గు చూపారనే సంకేతాలున్నాయి. ఓటింగ్ సరళిలో సైతం జగన్ - అనిల్‌కు అనుకూల ఓటింగ్ కనిపించిందని, గెలుపు తమదేనన్న ధీమాతో వైసిపి వర్గాలున్నాయి. మరి ఎవరి అంచనాలు విజయాన్ని అందుకుంటాయో చూద్దాం!?



## • కోవూరు



### వ్యతిరేకత గెలిపిస్తుందని ఒకరు

### సంక్షేమం గట్టెక్కిస్తుందని మరొకరు

సంచలన ఫలితాలకు కేంద్రమైన కోవూరు నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. పోలింగ్ తర్వాత గెలుపోటములపై ఇరు పార్టీల వాళ్ళు బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. తమ లెక్కలతోనే తమ గెలుపుపై నమ్మకం పెంచుకుంటున్నారు.

ముఖ్యంగా మహిళా ఓటర్లు ఆసక్తిగా పోలింగ్‌కు రావడం తెలుగుదేశం పార్టీ వారిలో ఆశలు పెరిగేలా చేస్తోంది. చంద్రబాబు తన పాలనాకాలం చివరిలో ఇచ్చిన పసుపు-కుంకుమ, పింఛన్‌ల పెంపు, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి వంటివి ప్రజల్లో బాగా పనిచేసాయని, అందుకే వీటి ద్వారా లబ్ది పొందిన అన్ని వర్గాల ప్రజలు పోలింగ్‌బూత్‌లకు తండోపతండాలుగా తరలివచ్చి సైకిల్ గుర్తు మీద ఓట్లు గుద్దేసిపోయారని నమ్ముతున్నారు. ఇక తెలుగుదేశం అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వ్యక్తిగత పరిచయాలు, లోకల్ కావడం వంటివన్నీ కూడా తెలుగుదేశం గెలుపుకు బాటలు వేస్తాయనే అంచనా వేస్తున్నారు.

వైసిపి అభ్యర్థి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన గెలుపుపై ఈసారి చాలా ధీమాగా వున్నారు. 2014 ఎన్నికల్లో ఆర్ధిక కారణాలతో ఆయన ఓడిపోయాడు. ఆనాటి ఎన్నికల లోపాలను ఈ ఎన్నికల్లో చాలావరకు సవరించుకున్నాడు. ఇక జగన్‌కు ప్రజల్లో వున్న సానుభూతి, ఆయనకు ఒక్క అవకాశమిచ్చి చూడాలన్న ప్రజాభిప్రాయం ఈసారి తన గెలుపుకు బాటలు వేస్తుందన్నది ప్రసన్న విశ్వాసం. సిటింగ్ ఎమ్మెల్యేగా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై వున్న వ్యతిరేకతతో పాటు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో బలమైన వర్గమున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలోకి వచ్చి లోక్‌సభ అభ్యర్థి కావడం కూడా ప్రసన్నకు కలిసి వచ్చింది. ప్రసన్నకు సొంత వర్గం వుండడం, రెడ్ల ఆధిపత్యం వుండే నియోజకవర్గం కావడం, అన్నింటికి మించి జగన్ పట్ల వున్న ఆదరణ తనను గెలిపిస్తాయని ప్రసన్న బలమైన నమ్మకం.

---

**వరుసగా పంచాయితీ, మున్సిపల్, జడ్పీ ఎన్నికలు**



# స్థానిక సమరానికి సన్నద్ధం

**రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. మే 23వ తేదీన ఫలితాలు వస్తాయి. ఏ పార్టీయో తెలియదు గాని కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. కొత్త ప్రభుత్వంలోనే పంచాయితీ, మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయి. కొత్త ప్రభుత్వంలో జరిగే ఈ ఎన్నికల గురించి ఎవరూ పెద్దగా టెన్షన్ పడబల్లేదు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి అనుకూలంగానే ఈ ఎన్నికల ఫలితాలన్నీ ఉండొచ్చు. అభ్యర్థులకు పెద్దగా డబ్బు ఖర్చుగాని, టెన్షన్ గాని, హింస గాని వుండదు.**

2014లో స్థానిక ఎన్నికలు ఇలా జరగలేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాతే స్థానిక ఎన్నికలకు పోవాలని ఎన్నికల కమిషన్ భావించినప్పటికీ, కొందరు స్థానిక ఎన్నికలపై హైకోర్టుకు పోవడంతో, అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే స్థానిక ఎన్నికలు జరపాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు హడావిడిగా ఎన్నికలు పెట్టారు. ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వం డమ్మీ... పోటీ అంతా తెలుగుదేశం, వైసిపిల మధ్యే జరిగింది. పోటీలో నిలిచిన అభ్యర్థులు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకున్నారు. అయితే స్థానిక ఎన్నికలను ముందుగానే నిర్వహించినా అసెంబ్లీ ఎన్నికల తర్వాతే ఫలితాలు వెల్లడించారు. ఈ ఫలితాలను వెల్లడించినా కూడా మేయర్, మున్సిపల్ ఛైర్మెన్స్, జడ్పీ ఛైర్మెన్స్, ఎంపీపీల ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్వహించారు. అప్పుడే తెలుగుదేశం అధికారంలోకి రావడంతో వీటి ఎంపికలో ప్రలోభాల పర్వానికి తెరలేపి పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. ఇదంతా కూడా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక సంస్థల ఛైర్మెన్‌లను ఎంపిక చేయడం వల్లే!

ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. అన్ని ఎన్నికలు ప్రశాంతంగా, పెద్దగా డబ్బు ఖర్చు లేకుండా జరిగిపోవచ్చు. మున్సిపాల్టీలు, జడ్పీలు, సహకార బ్యాంకులు, పంచాయితీలు... అన్నింటికీ కాల వ్యవధి అయ్యింది. మే 23 ఫలితాల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. బహుశా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అన్ని ఎన్నికలు అయిపోవచ్చు.

స్థానిక ఎన్నికలకు అధికారులు అప్పుడే సన్నాహాలు మొదలుపెట్టారు. పంచాయితీ, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రధాన ప్రక్రియ బి.సి, మహిళా రిజర్వేషన్‌లను అమలు చేయడం. ఆయా పంచాయితీ, జడ్పీ, మున్సిపాల్టీ, కార్పొరేషన్‌లు, డివిజన్‌లు, వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలను రిజర్వేషన్‌ల వారీగా కేటాయించాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రెండు మూడు నెలల్లో రాష్ట్ర అధికార యంత్రాంగమంతా ఎన్నికల విధులలోనే ఉండకతప్పదు.

# ఎలక్షన్ సరిగా చేయలేదా?

## ➢ గౌతంరెడ్డిపై తీవ్ర వ్యతిరేకత



ఆత్మకూరు... జిల్లాలోనే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగావున్న నియోజకవర్గం. 2014 ఎన్నికల్లో 33వేల ఓట్ల అత్యధిక మెజార్టీ సాధించిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో సాధించిన మెజార్టీ వల్లే అప్పుడు ఎంపీగా పోటీ చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలిచి గట్టెక్కాడు.

అలాంటి నియోజకవర్గంలో ఇప్పుడు ఎలక్షన్ ఏ విధంగా జరిగింది. గెలుపు గ్యారంటీ అని ఎందుకు చెప్పడం లేదు. ఆనం రామనారాయణరెడ్డి వంటి బలమైన వర్గమున్న నాయకుడు కూడా వైసిపిలో చేరాడు. ఆయన కూడా వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డికి గట్టిగా సహకరించాడు. మరి ఇంత సపోర్ట్ వుంది... మేకపాటి వాళ్ళకు సొంత మండలం మర్రిపాడు ఈ నియోజకవర్గంలోనే వుంది. అలాంటప్పుడు వైసిపి గెలిచే సీట్లలో ఆత్మకూరు పేరు మొదటిదిగా వినిపించాలి. అలాంటిది ఇప్పుడు ఈ సీటు పరిస్థితి నువ్వా-నేనా అన్నట్లుగా వుందని సమాచారం. నియోజకవర్గంలో వైసిసికి బలమైన కేడర్ వున్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి బాగా వెనుకబడ్డాడనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

సిటింగ్ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఆయన తిరిగింది చాలా తక్కువ. ఈ విషయంలో జిల్లాలోని మిగతా 5మంది వైసిపి ఎమ్మెల్యేలు ఎంతో ముందున్నారు. కాని, గౌతంపై ప్రజల్లో సానుకూలత లేదు. పోనీ ఎలక్షన్ అన్నా శుద్ధంగా చేశాడా? అంటే... గబ్బు పట్టించాడని వైసిపి నాయకులు బాధపడుతున్నారు. నియోజకవర్గంలో చాలా గ్రామాలలో ఆయన ప్రచారానికి పోలేదు. ఒక పక్కా ప్లానింగ్‌తో ఎన్నికలు చేయలేదు. ఓ పక్క తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్య వైకాపా నాయకులను లాగేసుకుంటుంటే, గౌతం ఎవరిని కూడా సపోర్ట్ చేయమని అడగలేదు. ఖర్చులకు డబ్బుల విషయంలో కూడా కార్యకర్తలు, స్థానిక నాయకులను చాలా ఇబ్బంది పెట్టాడని, ప్రచారంలో ఉధృతి లేకుండా చేసి, మంచి మెజార్టీతో సులభంగా గెలవాల్సిన సీటులో తెలుగుదేశం వాళ్ళకు ఆశలు కల్పించేలా చేసాడని వైసిపి కేడర్ మండిపడుతోంది. గౌతంకు బదులు ఇంకే నాయకుడికి ఈ సీటు ఇచ్చివున్నా మంచి మెజార్టీ వచ్చుండేదని వైసిపి నాయకులు వాపోతున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

## సెలవుపై ఆలీం బాషా



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీం బాషా సుదీర్ఘ సెలవు పెట్టారు. అనారోగ్య కారణాలతోనే ఆయన సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన గుండెపోటుకు గురయ్యారు. ఈమధ్యంతా ఎన్నికల నిర్వహణలోను బాగా ఒత్తిడికి గురయ్యారు. విశ్రాంతితో ఈ ఒత్తిడిని తగ్గించుకోవడానికే ఆయన సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ ఎస్.ఇ రవికృష్ణమ రాజును అలీంబాషా తిరిగి వచ్చేవరకు ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా నియమించారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన



ఎస్2 వద్ద అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణకు జిల్లా అగ్ని మాపక అధికారులు ఈనెల 15న ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు పాల్గొని ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ వద్ద వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాలకు అవకాశం ఎక్కువ అని కాబట్టి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేసి నెల్లూరు ఎస్-2 సినిమా థియేటర్‌లో అగ్ని మాపక పరికరాల ద్వారా మంటలను ఎలా ఆర్పవచ్చే డెమో ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ అధికారులు శంకర ప్రసాద్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ బిందుమీనన్‌కు అరుదైన అవకాశం



వాల్టన్ సెంటర్‌లో ఉపన్యసిస్తున్న డాక్టర్ బిందుమీనన్

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వాల్టన్ సెంటర్ (సెంటర్ ఫర్ ఎక్స్‌లెంట్ ఇన్ న్యూరోసైన్స్)లో నెల్లూరు అపోలో ఆసుపత్రి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ న్యూరాలజీ ఆన్ వీల్స్ రూరల్ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్ గురించి ఉపన్యసించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతినెల ఒకరికి వచ్చే ఈ అరుదైన అవకాశం ఈసారి డాక్టర్ బిందుమీనన్‌కు లభించింది. అక్కడి ప్రముఖ న్యూరో సైంటిస్ట్ ప్రొఫెసర్ టోనీ మార్సన్ బిందుమీనన్ చేసిన న్యూరాలజీ ఆన్ వీల్స్‌ను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్, యూనిట్ హెడ్ నవీన్, వైద్య సిబ్బంది ఆమెను అభినందించారు.



## నాయకులు రిలాక్స్

ఎన్నికలలో ఎవరు గెలుస్తారో ఎవరు ఓడతారో తర్వాత సంగతి గాని ఎన్నికల టెన్షన్ నుండి అభ్యర్థులు, నాయకులు మాత్రం రిలాక్స్ అయ్యారు. కౌంటింగ్‌కు 40రోజుల గ్యాప్ రావడంతో ఈ టెన్షన్ నుండి బయట పడేందుకు కొంతమంది నాయకులు, అభ్యర్థులు కుటుంబసభ్యులతో కలిసి టూర్లు ప్లాన్ చేసుకున్నారు. చాలామంది ఎన్నికలు అయిపోయిన పక్కరోజే ఫ్లైట్‌లు ఎక్కేసి తమకు నచ్చిన ప్రాంతాలకు చెక్కేశారు.

## ఏటిఎంలు ఊడ్చేశారు!



నెల్లూరు నగరంలో కరెన్సీకి కొరత ఏర్పడింది. ఏటిఎంలలో డబ్బులు నిల్వ వుండడం లేదు. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల వాళ్ళు ఏటిఎంలలో వున్న డబ్బులన్నీ వూడ్చేశారు. ఆ సమయంలో సామాన్యులకు ఏటిఎంలలో క్యాష్ దొరకలేదు. రాజకీయ పార్టీల నుండి జనానికి, నాయకులకు పోయిన డబ్బు తిరిగి ఏదో ఒకరూపంలో బ్యాంకులకు చేరితేనేగాని ఈ కరెన్సీ కొరత పూర్తిస్థాయిలో తీరదు.

## ఏపిజిబి నెల్లూరు రీజియన్‌కు అవార్డులు

మార్చి 31 నాటికి వివిధ రంగాల్లో సాధించిన ప్రగతికిగాను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నెల్లూరు రీజియన్‌కు మూడు అవార్డులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అటల్ పెన్షన్ యోజన పథకాన్ని ప్రారంభించడంలో నెల్లూరు రీజియన్ మొదటి స్థానంలో నిలిచింది. అలాగే గ్రామీణ ప్రాంతాలలోని ఖాతాదారులకు బీమా సేవలను చేరవ చేయడంలోనూ, బ్యాంకు సిబ్బంది పనితీరులోనూ నెల్లూరు రీజియన్ అగ్రస్థానంలో నిలిచింది. దీనికిగాను బ్యాంకు నెల్లూరు రీజియన్‌కు మూడు అవార్డులు లభించాయి.

## సెయింట్ జోసెఫ్‌లో స్పాట్ వాల్యుయేషన్

నెల్లూరు, దర్గామిట్టలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ 15వ తేదీ నుండి ప్రారంభమైంది. బయట జిల్లాలకు చెందిన 60వేల పదో తరగతి జవాబు పత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేస్తున్నారు. 1600 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది మూల్యాంకనంలో పాల్గొంటున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 40పేపర్లను దిద్దాల్సి వుంటుంది. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా పేపర్లు దిద్దే కార్యక్రమం వుంటుంది. ఈ నెల 27వ తేదీతో పేపర్లు దిద్దే పని కూడా అయిపోతుంది.

## అన్నదానం

శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈనెల 14న నెల్లూరులోని 4వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పేదలకు స్వయంగా అన్నం వడ్డిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పందేలు మొదలయ్యాయి



ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఎన్ని కోట్లు ఖర్చు పెడతాయో తెలియదు గాని ఎన్నికలు ముగిసాక మాత్రం పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై పందేలరాయుళ్ళు కోట్ల రూపాయల్లో పందేలు కాస్తుంటారు. ఎన్నికలు ముగియడంతోటే జిల్లాలో పందేలు పూపందుకున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతుంది అనే పాయింట్ మీద కోట్ల రూపాయల్లో పందేలు నడుస్తున్నాయి. ఐదు లక్షలు, పది లక్షలు అంటే లెక్కలేకుండా పందేలు పెడుతున్నారు. రాష్ట్రంలో వైసిపి గెలుస్తుంది అన్న పాయింట్ మీదే ఎక్కువమంది పందేలు కాస్తున్నట్లు సమాచారం. అలాగే కేంద్రంలో బీజేపీ పూర్తి మెజార్టీతో మళ్ళీ అధికారంలోకి వస్తుందా? హంగ్ వస్తుందా? అనే అంశాల మీద కూడా తక్కువ స్థాయిలో పందేలు జరుగుతున్నాయి. అలాగే వైసిపికి వంద సీట్లు దాటుతాయా? లేదా? అనే పాయింట్ మీదా పందేలు కాస్తున్నారు. ముఖ్యంగా మంగళగిరిలో లోకేష్ – ఆర్కేల గెలుపోటముల మీద, అలాగే నెల్లూరులో అనిల్, నారాయణ జయాపజయాల మీద భారీ మొత్తంలో పందేలు నడుస్తున్నాయి. నెల్లూరుజిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి అనే అంశం మీద కూడా పందేలు పెడుతున్నారు.



## నెల్లూరు రైల్వేస్టేషన్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లో వసతులు, స్వచ్ఛత తదితర అన్ని విభాగాల్లో అత్యున్నత సేవలు అందించినందుకు గాను నెల్లూరు స్టేషన్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ప్రతి ఏటా అందించే ఈ అవార్డులను ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం ధనుంజయ చేతుల మీదుగా నెల్లూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఆంథోని జయరాజ్ అందుకున్నారు. దీంతో పాటు నలుగురు ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డులను ఆయన అందజేశారు. వీరిలో పార్శిల్ సూపర్ వైజర్ విజయభాస్కరరెడ్డి, మహిళా స్టేషన్ మాస్టర్ ఎస్ మేరీప్రసన్న, వెయిటింగ్ రూమ్ అటెండర్ ఎం. శిరీష, రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లు ఉన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సంబరాలు



శ్రీరాముని గుణగుణాలను వివరిస్తున్న బలరామయ్యనాయుడు

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు అధ్యక్షతన ఈనెల 14 న శ్రీరామనవమి సంబరాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నలుబోలు బలరామయ్య నాయుడు శ్రీరాముని గుణగణాలను గురించి, శ్రీరామనవమి ప్రాశస్త్యం గురించి వివరించారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన మానవాళికి చేసిన సేవలు గురించి వివరించారు. అనంతరం వాకర్స్ సభ్యులకు వడపప్పు, పానకం పంపిణీ చేసారు. ఉపాధ్యక్షులు జీవీ కృష్ణయ్య, కోశాధికారి కొండూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి లక్కాకుల శ్రీనివాసులు, సాయి సుబ్బారావు, దొడ్ల జయరామానాయుడు, డాక్టర్ కె.సత్యనారాయణ, జాలీవాకర్ ఐ సోను తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా కోడ్ వుంది



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ మురళీకృష్ణ

మే నెల 27వ తేదీ దాకా ఎన్నికల కోడ్ అమలులో వుంటుందని, పోలింగ్ పూర్తయ్యింది కదా అని నిబంధనలు ఉల్లంఘిస్తే చూస్తూ వూరుకునేది లేదని నగర డిఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. 15వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో వున్నందువల్ల 30 పోలీస్‌యాక్ట్, 144 సెక్షన్‌లు అమలులో వుంటాయని చెప్పారు. ర్యాలీలు, ఆందోళనలు, సభలు, సమావేశాలు జరపాలంటే సబ్‌డివిజన్ పోలీసు అధికారి అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు కోడ్ అమలులో వున్నంతవరకు నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## 'రెయిన్‌బో'లో అట్టహాసంగా కలర్స్-2019



కలర్స్-2019లో పాల్గొన్న చిన్నారులు

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూలు ప్రీ ప్రైమరీ వార్షికోత్సవం కలర్స్-2019 వేడుకలు నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో అట్టహాసంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తల్లిదండ్రులు పనుల వత్తిడిలో ఎంత బిజీగా వున్నా వారి సమయాన్ని కొంత పిల్లలతో గడపాలన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగాలలో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం రెయిన్ బో కిండర్ గార్డెన్ టీం లీడర్ ఫాతిమాఖాన్ ఆధ్వర్యంలో జరిగింది. మాగుంట లేఅవుట్ ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, రెయిన్‌బో సీబీయస్‌ఈ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రతాప్‌రాజ్, కొరియోగ్రాఫర్స్ సురేష్, అనురాధ, సంధన్, కళ్యాణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రశాంతతను చెడగొట్టొద్దు

## నెల్లూరు సంస్కృతిని మార్చొద్దు!

దేశంలోనే నెల్లూరుజిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. నాగరికతకే కాదు, ప్రశాంతమైన జీవనానికి కూడా మారుపేరు నెల్లూరుజిల్లా. ఏ జిల్లాకు చెందిన అధికారైనా నెల్లూరుజిల్లాకు బదిలీ వచ్చిందంటే ఆనందంతో ఎగిరి గంతులేస్తాడు. ఈ నెల్లూరులో జీవనానికి అలవాటైన ఎంతోమంది ఉద్యోగులు తమ రిటైర్మెంట్ తర్వాత ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని వుంటున్నారు. ఇక్కడ రౌడీయిజం లేదు... మావోయిజం లేదు... అన్నింటికి మించి కుల ఆధిపత్య పైత్యం, ప్రాంతీయతత్వం వంటి పెదధోరణులు లేవు.





నెల్లూరుజిల్లా రాజకీయాలలో కూడా నెత్తుటి మరకలు కనిపించవు. ఫ్యాక్షన్ రాజకీయాలుండవు. ఎన్నికల సమయంలో ఏదో చిన్నచిన్న గొడవలు రేగినా వెంటనే సర్దుకుంటుంటాయి. పార్టీలు వేరైనా ఇక్కడి నాయకులు స్నేహానికి ప్రాధాన్యతనిస్తారు. రాజకీయాలను పక్కనపెట్టి, జెండాలను అజెండాలను మూలపెట్టి రాత్రయితే మావా, బావా అని మాట్లాడుకుంటుంటారు. సిద్ధాంతాలు, వైరుధ్యాలు కేవలం ఎన్నికల వరకే! విమర్శలు, ప్రతి విమర్శలు ఈవిఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు పోయేంత వరకే! ఒకరిపై ఒకరు ప్రత్యర్థులుగా పోటీ చేసిన వాళ్ళు కూడా రాత్రయితే ఒక చోటకు చేరుతారు. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా వాటిని అక్కడితో మరచిపోతారు. అధికార పార్టీ, ప్రతిపక్షం అనే తేడా వుండదు. ఎవరు ఏ పార్టీలో వున్నా ఒకరి అవసరం ఒకరు తీరుస్తారు. అధికారంలో ఏ పార్టీ వున్నా రాజకీయాలకతీతంగా అందరి పనులు చేసి పెడుతుంటారు. ఇక్కడ విమర్శలు, సిద్ధాంత విభేదాలన్నవి ఎలక్షన్ జరిగే నెలరోజులకే పరిమితం. మిగతా 4ఏళ్ళ 11 నెలల కాలం స్నేహపూరిత వాతావరణమే!

నెల్లూరు రాజకీయ చరిత్రలో కక్షపూరిత దాడులు, ప్రతిదాడులకు ఇంతవరకు స్థానం లేదు. నెల్లూరు ప్రజలు అలాంటి వాతావరణాన్ని కూడా ఆమోదించరు. మొన్న ఎన్నికలు ముగిశాక నెల్లూరునగరంలో జరిగిన తెలుగునాడు విద్యార్థి సంఘం నాయకుడిపై దాడి, మరో రెండు సంఘటనలు నెల్లూరు వాతావరణాన్ని కలుషితం చేసేవిగా వున్నాయి. రాజకీయాలలో వాదనలు, ప్రతివాదనలు వుండొచ్చు. విమర్శలకు ప్రతి విమర్శలు చేసుకోవచ్చు. దాడులు, ప్రతిదాడులు ఎంత మాత్రం ఆహ్వానించదగ్గవి కావు. తెలుగునాడు విద్యార్థి సంఘం నాయకుడిపై దాడి, ఆ తర్వాత ఓ పార్టీ కార్యాలయంపై ప్రతిదాడి... ఇలాంటి సంఘటనలు నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రకే మచ్చగా మిగిలిపోతాయి.

ఇలాంటి వాటితో రాజకీయంగా సాధించేదేమీ వుండదు. పోరాటాలు, ఉద్యమాలే రాజకీయ ప్రస్థానంలో మెట్లుగా ఉపయోగపడుతాయిగాని ఇలాంటి చర్యల వల్ల ఫలితం శూన్యం. ఈ జిల్లా నుండే స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిలు ముఖ్యమంత్రులు అయ్యారు. వెంకయ్యనాయుడు భారత ఉపరాష్ట్రపతి పదవిలో వున్నారు. వాళ్ళు సిద్ధాంతాలతో పోరాడారేగాని, హింసా సంస్కృతిని ఏనాడూ ప్రోత్సహించలేదు.

రాజకీయాలలో దాడుల సంస్కృతిని ఎవరు ప్రోత్సహించినా, ఎవరు ప్రేరేపించినా అది తప్పే! నెల్లూరు రాజకీయ నాయకులకు ఎంతో స్నేహంగా వుంటారని, ఎన్నికలయ్యాక రాజకీయాలకు అతీతంగా మసలుకుంటారని పేరుంది. ఆ పేరును శాశ్వతం చేయండి.

# ఆత్మజ్ఞాన సంపన్నుడు.. భగవాన్ రమణ మహర్షి


## - ఉభయరాష్ట్రాల ప్రముఖ స్వామీజీల సమక్షంలో ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ స్వామీజీలు

భగవాన్ రమణ మహర్షి పరిపూర్ణమైన ఆత్మజ్ఞాన సంపన్నుడని పలువురు ప్రముఖ స్వామీజీలు పేర్కొన్నారు. కోవూరు మండలంలోని లేగుంటపాడులో ఉన్న శ్రీకృష్ణ అఖండానంద ఆశ్రమంలో ఈనెల 15న భగవాన్ రమణ మహర్షి ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన పలువురు మహర్షులు, ప్రముఖ స్వామీజీలు ఈ ఉత్సవంలో పాల్గొని భగవాన్ రమణ మహర్షి వైశిష్ట్యాన్ని, బోధనల ప్రాముఖ్యతను వివరించారు. రమణ మహర్షి పరమపదించినా వారి జ్ఞానబోధలు మాత్రం నేటికీ అఖండంగా నిలిచే ఉన్నాయన్నారు. పూజ్యశ్రీ నిశ్చలానందతీర్థస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన గిరిజానందతీర్థ స్వామి, కరీంనగర్‌జిల్లాకు చెందిన విశ్వేశ్వరానంద తీర్థస్వామి, నెల్లూరుజిల్లా ఇనమడుగుకు చెందిన పురుషోత్తమతీర్థస్వామి, గుంటూరు జిల్లా నుంచి ఆత్మానందతీర్థ స్వామి, కృష్ణానందగిరి స్వామి, ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి శారదానందతీర్థస్వామిని, దయానందగిరిస్వామి, అనంతగిరిస్వామిని, రామాయణం మహేశ్‌స్వామి, అశేషానందగిరిస్వామి తదితర స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మహర్షి ప్రియశిష్యులైన మహాయోగీశ్వరులైన అఖండానంద తీర్థయోగుల శ్వేత శిలావిగ్రహాన్ని ప్రతిష్టించి విశేష పూజలు, హోమాలు చేశారు. అఖండానందతీర్థయోగి మనుమడు తమ్మిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాధిక దంపతులు వితరణ చేసిన విగ్రహాన్ని వారు ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ రమణ మహర్షి ఆరాధకులు పాబోలు రామసుబ్బయ్య, బొమ్మిశెట్టి యలమందయ్య, శ్రీనివాసులురెడ్డి, పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంస్మరణ



కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు
నిర్యాణం: 23-4-1995 వర్ధంతి: 23-4-2019

మా తండ్రి
బోగొల్లు నారాయణరెడ్డి గారి
24వ వర్ధంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని ఆశిస్తూ...

బి.మోహన్‌రెడ్డి
Architect & Engineer
Mohan Architects (P) Ltd.,
Chennai
ఫోన్: 044-24510157
మరియు
కుటుంబసభ్యులు

# టిడిపికి ప్రతిపక్ష హోదా కూడా రాదు

## - ఆనం రామనారాయణరెడ్డి ధీమా



టిడిపికి ఈసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని, ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపి విజయం సాధించడం ఖాయమని, తాము అనుకున్న లక్ష్యానికి మించి ప్రజాతీర్పు ఉంటుందని మాజీ మంత్రి, వెంకటగిరి వైయస్సార్‌కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ధీమాగా అన్నారు. ఈ నెల 14న నెల్లూరులోని తన నివాసంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయినప్పటినుంచి చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుచూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, ఆయన్ను ఛీఛీ..చంద్రబాబు అనడం తప్ప, మరేదైనా అనాలంటే తమకు సభ్యత అడ్డం వస్తోందని అన్నారు. చంద్రబాబు తీరు చూస్తుంటే ఈ ఎన్నికల్లో ఆయన తన ఓటమిని అంగీకరించినట్లుగా ఉందన్నారు. బాబు మాటలు వింటుంటే ఇలాంటి వ్యక్తి మనకు సిఎంగా ఉన్నారా అని సిగ్గుపడాల్సి వస్తోందన్నారు. ఈవిఎంలపై నిందలు వేయడమేమిటని అంటూ, వేసిన ఓటు ఎవరికి పడిందో వెంటనే స్పష్టంగా తెలుస్తుందని, ఈవిఎంలను దొంగిలించిన వేమూరి హరిప్రసాద్‌ను ఎన్నికల కమిషన్ వద్దకు తీసుకువెళ్లడం సిగ్గుమాలిన చర్య అనీ ఆయన విమర్శించారు. ప్రస్తుతం సిఎస్‌గా పనిచేస్తున్న ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు నిజాయితీ అధికారిగా పేరుందని, గతంలో చంద్రబాబే ఇన్‌ఛార్జి సిఎస్‌గా ఉండాలని కోరాడని, ఇప్పుడు అదే ఎల్‌వి సుబ్రహ్మణ్యంను కోవర్టు అని, సహనిందితుడని చంద్రబాబు అనడం దుర్మార్గమన్నారు. రాజకీయ స్వార్థం కోసం సిఎస్‌ను బలి చేయడం దారుణమన్నారు. మంచి అధికారులపై చంద్రబాబు మాట్లాడుతున్న తీరును ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఎన్నికలకు ముందు అధికారులకు ఆదేశాలివ్వడం, ఇష్టమొచ్చినవారిని నియమించుకోవడం చేశారన్నారు. ఇప్పుడు ఓటమి భయంతోనే చంద్రబాబు అధికారులపై నిందలు వేయడం దారుణమన్నారు. చంద్రబాబు వెంటనే సిఎం పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపి నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నులో రాయితీ

2019-20 ఆర్థిక సంవత్సరంలో తొలివిడతతో పాటు రెండో విడత ఆస్తి పన్ను చెల్లించేవారికి కూడా 5శాతం రాయితీ ఇస్తున్నట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోపు మీ-సేవ, పురసేవా కేంద్రాల్లో ఈ పన్నులు చెల్లించి రాయితీ పొందవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### శ్రీ సిటీని సందర్శించి

# ముగ్ధుడైన రష్యా వాణిజ్య రాయబారి



రష్యా వాణిజ్య రాయబారి ఒలెగ్‌కు మెమొంటోను బహుకరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ వాణిజ్య రాయబారి ఒలెగ్ ఎన్ అవదీవ్ ఈ నెల 16న శ్రీసిటీని సందర్శించి శ్రీసిటీ ప్రగతిని చూసి ముగ్ధుడయ్యారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీని, పరిసరాలను వీక్షించడంతో పాటు ఆల్ స్టామ్ పరిశ్రమను సందర్శించారు. శ్రీసిటీకి విచ్చేసిన రష్యా వాణిజ్య రాయబారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీ విశిష్టతను, ప్రగతిని వివరించగా, ఇక్కడ వ్యాపారపరమైన అనుకూల వాతావరణం ఎంతో బావుందని ఆయన ప్రశంసించారు. పలు ప్రఖ్యాతమైన, విజయవంతమైన పరిశ్రమలకు చిరునామాగా మారిన శ్రీసిటీ మరింత ప్రగతిని సాధిస్తుందని ఆయన అన్నారు. అనంతరం శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రష్యన్ రాయబారి పర్యటన, చర్చల ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. రష్యన్ రాయబారి రాకను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని, శ్రీసిటీకి రష్యా నుంచి మరింతగా పారిశ్రామిక సహకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## 30లోగా ఇళ్ల పన్నులు చెల్లిస్తే..

# 5 శాతం రాయితీ

### - మునిసిపల్ కమిషనర్ రవి



ఈ నెల 30వ తేదీలోగా పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ లభిస్తుందని గూడూరు మునిసిపల్ కమిషనర్ పి.రవి తెలిపారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఈనెల 16న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-20 సంవత్సరానికి సంబంధించి ఇళ్ళ యజమానులు ఇళ్ళ పన్నులు, ఖాళీస్థలం పన్నులు ముందస్తుగా ఒకేసారి చెల్లిస్తే 5 శాతం పన్ను తగ్గింపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని, పన్నులు సకాలంలో చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. చెత్తాచెదారాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు అందరూ తోడ్పడాలన్నారు.

### అబ్దుల్ కలామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## చలివేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ రోహిణి, పక్కన తాజుద్దీన్

పాదచారుల దాహార్తిని తీర్చడమే ధ్యేయంగా గూడూరులోని అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సయ్యద్ తాజుద్దీన్ ఈనెల 14న స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట నిమ్మరసం, మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి చేతుల మీదుగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ అబ్దుల్‌కలామ్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. యువతకు ఆయన ఆదర్శప్రాయులన్నారు. ఆ మహనీయుని పేరుతో ట్రస్ట్ ఏర్పాటుచేసి పేదలు, వితంతువులు, వృద్ధులను ఆదుకోవడం ఎంతో అభినందనీయమని ట్రస్ట్ ప్రతినిధులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యులు చరిష్మా, వివి నారాయణరెడ్డి, తిరుమూరు సురేష్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కరిముల్లా, బర్కతుల్లా, నియమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

### - అగ్నిమాపక అధికారి విజయ వరకుమార్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

ఈ వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అగ్నిమాపక శాఖ అధికారి విజయ వరకుమార్ తెలిపారు. గూడూరులోని పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఈనెల 14న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారం రోజుల పాటు తమ సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు తహశీల్దార్ సుధారాణి తొలుత ఇక్కడ ఏర్పాటుచేసిన అగ్నిప్రమాద నివారణ పరికరాల స్టాల్‌ను పరిశీలించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నిమాపక సిబ్బంది రాజారమణ, రమణయ్య, వినోద్‌కుమార్, రామచంద్ర, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, నరసింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 128వ జయంతి సందర్భంగా గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్. నాయకులు కడివేటి చంద్రశేఖర్, మనపాటి శ్రీనివాసులు, చంద్ర తదితరులు.

## దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరులోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2019-20 విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.డి.శ్రీనివాసమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో దరఖాస్తులు పొందాలని, బికాం, బిఎస్సీ, బిఏ కోర్సుల్లో చేరదలచిన వారికి ఇక్కడ ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన జరుగుతుందని, తమ కళాశాల ఎన్‌ఏఏసిలో బి-గ్రేడ్ పొందిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



డా.బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గూడూరు అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు నయీం, చంద్ర తదితరులు.

# పోలింగ్‌బూత్‌లలో టీవీలు పెట్టాలి

## - ఈసీని కోరిన చంద్రబాబు

హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు తన రక్తాన్ని చెమటగా మార్చి ఇటుక ఇటుక పేర్చి, మధ్యలో సిమెంట్ కూర్చి 40ఏళ్ళు శ్రమకోర్చి కట్టిన హైదరాబాద్ నగరమది. లోటస్‌పాండ్‌లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నివాసం. రాత్రి సమయం. జగన్‌తో పాటు విజయమ్మ, భారతి, అనిల్ కుమార్, షర్మిల, విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డిలు కూడా వున్నారు. అందరూ డైనింగ్‌టేబుల్ వద్ద కూర్చుని భోజనాలకు ఉపక్రమించారు. విజయసాయిరెడ్డి వుండి... బాబూ ఇలా నీతో కలిసి భోంచేస్తున్నందుకు మాకు ఎంతో ఆనందంగా వుంది అని అన్నాడు. వెంటనే విజయమ్మ, భారతి, షర్మిలలు కూడా కోరస్‌గా... మాక్కూడా... అని అన్నారు. ఆ మాటకు విజయసాయిరెడ్డి ఆశ్చర్యపోయి... అదేంటి... మాకంటే రాకరాక అవకాశం మొచ్చింది. మీరెప్పుడూ ఇంట్లో వుండే వాళ్ళే కదా... అని అన్నాడు. అందుకు భారతి... మేమెప్పుడూ ఇంట్లో వుండే వాళ్ళమే... కాని, ఆయనెప్పుడూ ఇంట్లో ఉండడు కదా... 9ఏళ్ళుగా జనంలోనే వుంటున్నాడు. జనంలోనే తింటున్నాడు కదా, చాలాకాలం తర్వాత మాకు కూడా ఆయనతో కలిసి భోంచేసే అవకాశం చిక్కిందని చెప్పింది. అదీ నిజమేలే అనుకుంటూ భోజనాలు ముగించారు. విజయసాయిరెడ్డి వై.వి.సుబ్బారెడ్డి, విపిఆర్‌లు ఎన్నికల సరళిపై కొద్దిసేపు జగన్‌తో మాట్లాడారు. ముఖ్యంగా ఎన్నికలు అయిపోయాక చంద్రబాబు ఈవిఎంలపై ఎందుకు పడ్డాడనే చర్చ సాగింది. వేమిరెడ్డి వుండి... ఈ ఎన్నికల మాటేమోగాని, పోలింగ్‌బూత్ వద్ద తాగడానికి నీళ్లివ్వలేదు, తినడానికి కనీసం బిస్కెట్ కూడా ఇవ్వలేదని లోకేష్ అంటుంటే నాకు భలే బాధేసింది. పాపం చంటోడు... ఆకలికి ఎంతలా అల్లాడిపోకుంటే అంత బాధ పడిపోతాడు. మన ప్రత్యర్థులనే దృష్టితో కాకుండా... మానవత్వంతో మనం కూడా ఆలోచించాలి. ఈసారి జరిగే ప్రతి ఎన్నికలలోనూ పోలింగ్‌బూత్‌ల వద్ద లోకేష్ వంటి వారి కోసం బిస్కెట్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని ఎలక్షన్ కమిషన్‌ను డిమాండ్ చేద్దాం అని ప్రతిపాదించాడు. దానికి అందరూ ఓకే అన్నారు. జగన్ వుండి... ఈ చంద్రబాబు ఢిల్లీకి పోయి ఈవిఎంలపై గొడవ చేస్తుంటే నాకేదో అనుమానంగా వుంది, ముఖ్యంగా పోలింగ్‌బూత్‌లలో మహిళలు ఇబ్బంది పడ్డారని, ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ ఫెయిలైందని చంద్రబాబు ఢిల్లీలో గగ్గోలు పెడుతున్నాడు. అతని ప్లాన్ ఏమై వుంటుందంటారు అని అడిగాడు. విజయసాయిరెడ్డి వుండి... ఈ ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా వుండుంటే ఆయన ఇంత రచ్చ చేయడు. ఓడిపోతామనే భయంతోనే ఈవిఎంలపై గోలగోల చేస్తున్నాడు. ముఖ్యంగా మహిళా సమస్యలను ఎత్తి చూపుతున్నాడు. రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇందులో ఏదో కుట్ర కోణం దాగివుందని అన్నాడు. దానికి జగన్... చంద్రబాబు ఎన్ని ఎత్తులు వేసినా వాటిని మనం ఎదుర్కోవడానికి సిద్ధంగా వుందామని చెప్పాడు. తర్వాత అందరూ ఎవరికివాళ్ళు గుడ్‌నైట్‌లు చెప్పుకుని ఎవరి గదుల్లోకి వాళ్ళు పోగా, విజయసాయిరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, విపిఆర్‌లు తమ ఇళ్లకు బయలుదేరారు.

జగన్ తన గదిలో బెడ్‌పై వాలగానే ఒళ్ళు పులిసిపోయి వుండడంతో నిద్రపట్టేసింది. కాని, భారతికి మాత్రం నిద్ర రాలేదు. చంద్రబాబు రీపోలింగ్ జరపాలని, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారనే విషయాలనే ప్రస్థావిస్తున్నారని, దీని వెనుక ఏదో కుట్ర కోణం దాగుందని జగన్ అన్న మాటలే ఆమె చెవుల్లో రిపీట్‌గా మార్మోగిపోసాగాయి. అలా ఆలోచిస్తూనే ఆమె నిద్రలోకి జారుకుంది.

★★★★★

ఉండవల్లిలోని హైటెక్‌రత్న చంద్రబాబు నివాసం. చంద్రబాబుతో పాటు మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావ్, దేవినేని ఉమామహేశ్వరరావు, పి.నారాయణ వున్నారు. యనమల వుండి... సార్, పోలింగ్ ప్రశాంతంగా జరిగింది కదా... మరి ఎందుకు రీపోలింగ్ కావాలంటున్నారని అడిగాడు. అందుకు చంద్రబాబు... మహిళల ఓట్లను మనం సరిగా వేయించుకోలేకపోయాం. పసుపు - కుంకుమ డబ్బులు సరిగా పని చేయలేదు. మహిళల ఓట్లు మనకు సంపూర్ణంగా పడలేదు... అని అన్నాడు. అలా ఎలా చెప్పగలరని నారాయణ ప్రశ్నించాడు. దానికి చంద్రబాబు... ఈ ఎలక్షన్ కమిషన్ కేంద్రంతో కుమ్మక్కై గురువారం పోలింగ్ పెట్టింది. అదే శనివారమో, ఆదివారమో పెట్టుంటే మనకు అనుకూలంగా వుండేది అని అన్నాడు. అదెలా అని దేవినేని ఉమ అడిగాడు. చూడు బ్రదర్... గురువారం ఉదయం 9గంటలకు జీ తెలుగులో 'ఇనుప రేకులు', 10 గంటలకు ఈ టీవీలో "మొగుడిని కొట్టిన పెళ్లాం", 12గంటలకు జెమినిలో "అత్తాకోడళ్ళ సవాల్", 2గంటలకు మాటీవీలో 'చావుకు దారేది', 3గంటలకు 'చావు రాని అత్త... సుఖం లేని కోడలు'... ఇలా బోలెడన్ని సీరియల్స్... మహిళలు అప్పటికే ఒకటీ రెండు సీరియల్స్‌ని వదులుకుని ఓటేద్దామని పోలింగ్ బూత్‌ల వద్దకు వస్తే ఈవిఎంలు మొరాయించి, పోలింగ్ గంటలకు గంటలు ఆలస్యం కావడంతో మహిళలు ఇక సీరియళ్ళు చూడకుండా వుండలేక ఇళ్ళకు పోయారు. ఆ పరిస్థితి ఉండకూడదన్నదే నేను చెప్పేది అని చంద్రబాబు అన్నాడు. మరి రీ పోలింగ్ జరిపినా మహిళలు వస్తారా... అని యనమల అడిగాడు. అప్పుడు చంద్రబాబు... ఇక్కడే మనం ఒక ప్లాన్ అమలు చేయబోతున్నాం. ఎలక్షన్ కమిషన్ రీపోలింగ్‌కు ఆదేశిస్తే... ప్రతి పోలింగ్ బూత్‌లోనూ టీవీలు ఏర్పాటు చేసి వాటికి డిష్ కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేయబోతున్నాం. పోలింగ్‌బూత్‌లో నిలున్న ఏ మహిళ కూడా ఒక్క సీరియల్ కూడా మిస్ కాకూడదన్నదే నా లక్ష్యం. అలాగే ప్రతి పోలింగ్ బూత్‌లోనూ అద్దంతో పాటు మేకప్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తాం అని చెబుతుండగా... నారాయణ కలుగజేసుకుని, సార్, ప్రతి పోలింగ్‌బూత్‌లో బిస్కెట్లు కూడా పెట్టించండి... మొన్న అవి లేక మన లోకేష్ బాగా ఇబ్బంది పడ్డట్లున్నాడు అని చెప్పాడు. చంద్రబాబు అందుకు... వాడికి బిస్కెట్లు కావాలంటే మనం అరేంజ్ చేద్దాంలే... పోలింగ్‌బూత్‌లలో టీవీలు, మేకప్‌కిట్‌లు ఖచ్చితంగా పెట్టించాలి. అందుకు కారణం మనమేనని చెప్పుకోవాలి. ఈ దెబ్బతో 11వ తేదీ వైసిపికి వేసిన మహిళలు కూడా ఈసారి మనకే ఓట్లు గుద్దుతారు అని చెప్పాడు. అది విని కళావెంకట్రావ్... మీ బుర్రే బుర్ర సార్ అంటూ ఆయన తలకాయను కళ్ళకద్దుకుంటూ... ఈ లెక్కలో ఎలక్షన్ జరిగితే మనకు 150సీట్లు ఖాయం అని అరవసాగాడు.

ఆ అరుపులకు 'కెవ్' అని అరుస్తూ భారతి నిద్రలోంచి లేచింది. ఆ అరుపుకు జగన్ కూడా ఉలిక్కిపడి లేచాడు. పక్కనే వున్న చెంబులో నీళ్లు తీసి ఆమె ముఖాన చల్లాడు. ఆమె కలలో నుండి బయటకు రావడానికి ఐదు నిముషాలు పట్టింది. ఆమె స్థిమితపడ్డాక ఏమైంది అని జగన్ అడిగాడు. భారతి తనకొచ్చిన కలను, కలలో చంద్రబాబు వేస్తున్న ప్లాన్‌ను గురించి చెప్పింది. అది విని జగన్... పడుకోబోయే ముందు సుబ్బారెడ్డి చిన్నాన్న, సాయన్న, ప్రభాకరన్న, నేను మాట్లాడుకున్న మాటలు విన్నావ్ కదా... అదే మనసులో పెట్టుకుని నిద్రపోయి వుంటావ్... ఇలాంటి కల వచ్చింది... ఏమీ కాదులే అన్నింటికీ దేవుడున్నాడు పడుకో అంటూ ఆమెకు ధైర్యంచెప్పి మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపి దళిత సేన నాయకులు

# అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరికి ఆదర్శప్రాయుడని, నేటి యువత, విద్యార్థినీ, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఏపి దళిత సేన, ఏపి ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ పేర్కొన్నారు. ఈనెల 14న నెల్లూరు సర్వోదయ కాలేజీలోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేకును కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. సర్వోదయ కళాశాల ప్రిన్సిపల్ డా. సీవీ సురేష్, యూనివర్శిటీ కో-ఆర్డినేటర్ మురారిశెట్టి పిచ్చయ్య, సిబ్బంది శ్రీనివాసులు, రత్నం, శర్మ, అశోక్‌కుమార్, రాయపు ప్రవీణ్ కుమార్, చిట్టేటి శ్రీనివాసులు, షేక్ బాబు, కొడాలి బాలకృష్ణ, లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా డబ్బు పంచారు - 'చంద్ర' నిప్పులు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, వైయస్సార్ సీపీలు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసారని, ఎన్నికల సంఘం, పోలీస్ అధికారులు ఈ చర్యను నిలువరించలేక చేతులెత్తేసారని నెల్లూరు సీపీయం ఎంపి అభ్యర్థి చంద్ర రాజగోపాల్ ఆరోపించారు. ఈనెల 13న సీపీయం జిల్లా కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ టీడీపీ ఓటుకు రెండు వేలు ఇస్తే, వైసీపీ వెయ్యి రూపాయలు వంతున బహిరంగంగా పంచారన్నారు. కొంతమంది రెవిన్యూ అధికారులు దగ్గర వుండి కమీషన్ ప్రాతిపదికన ఈ తంతు నడిపించారన్నారు. చట్టసభలకు ఎన్నికవుతున్న బడా పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు స్వప్రయోజనాలకు విలువ ఇస్తున్నారేగాని ప్రజాప్రయోజనాలు పట్టించుకోవడం లేదన్నారు. సీపీయం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

# సాయిదర్బార్ సాయినాధుని దివ్య రథోత్సవం

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఉగాది శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 14న శ్రీ సాయినాధుని దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారామచంద్రుల వారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రం విష్ణు సహస్రనామ సామూహిక పారాయణాన్ని భక్తులు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు షిరిడి సంప్రదాయం ప్రకారం శ్రీ సాయినాధుని దివ్య రథోత్సవం, వెండి పల్లకీ ఉత్సవం, ముస్లీంల గంధమహోత్సవం, జెండా ఉత్సవం కలిసి ఒకే ఊరేగింపుగా దేవస్థానం నుండి బయలుదేరింది. విశేష పుష్పాలంకరణలతో, విద్యుద్దీప కాంతులతో, శ్రీ సాయినామ సంకీర్తనలతో, ముస్లీం ఫకీర్ల గానాలతో, మంగళ వాయిద్యాలు, తెనాలి తీన్ మార్ బ్యాండ్ వాయిద్యాలు, బళ్ళారి బ్యాండ్ వాయిద్యాలు, పండరిభజనలు, మహిళల కోలాటాలు, గుర్రాల పదరవళులతో పల్లకీ ఉత్సవం పద్మావతి నగర్ మీదుగా బాలాజీ నగర్, ఏసీ నగర్ పురవీధుల్లో అత్యంత వైభవంగా, శోభాయమానంగా సాగింది. భక్తులు తమ ఇండ్ల ముంగిట రంగవల్లులతో పల్లకీ ఉత్సవానికి స్వాగతం పలికి కర్పూర హారతులిచ్చి, టెంకాయలు కొట్టి విశేష పూజలు నిర్వహించారు. సాయినాధుని రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవం దేవస్థానానికి చేరుకోగా పవిత్ర గంధాన్ని బాబా వద్ద ఉంచి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదంగా అందజేశారు. భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



సాయినాధుని రథోత్సవం

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం

# పేద మహిళలకు చీరల పంపిణీ

దుబాయ్‌లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సుంకు సాయి ప్రసాద్, లత దంపతులు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారి పేరు మీదుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 13న శ్రీరామనవమిని పురస్కరించుకుని నెల్లూరులో 400 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడపకు చెందిన యోగా గురువు ఓబయ్య యోగా, ఆరోగ్యం, సంతోషం అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. దాతలు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇలాగే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గాదంశెట్టి సుధాకర్, కోలపర్తి రమేష్, గాదంశెట్టి గోపి, వాసవి మహిళామండలి సభ్యులు పర్యవేక్షించారు.

# చెన్నై కళాసాగర్‌కి 47 యేళ్ళు



తమిళనాడులో వున్న తెలుగువారి కోసం 1972 ఏప్రియల్ 9వ తేదీ డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి(సి.యం.కె.రెడ్డి) సారధ్యంలో కళాసాగర్ సాంస్కృతిక సంస్థ ప్రారంభమైంది. ఆ తరువాత కాలంలో "కళాసాగర్" ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు వేదికగా మారింది. సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా తీసిన పై చిత్రంలో ఎడమ నుండి కుడికి... శ్రీమతి అంజలిదేవి, వి.బి.రాజేంద్రప్రసాద్, శ్రీ స్వామినాథన్, డా॥ ముద్దుకృష్ణారెడ్డి, అక్కినేని నాగేశ్వరరావు, మాదవపెద్ది సత్యం, కె.వి.మహదేవన్‌లు.

# పోస్టల్ ఫైట్



ఎన్నికల గెలుపోటములలో ప్రతి ఓటు కీలకమే. ఎవరి ముఖాన గెలుపు ఓటములు ఏ రీతిలో రాసి పెట్టి వుంటాయో మనం వూహించలేం. పార్టీల గాలి తోలి వేల మెజార్టీలతో ఓడిపోయి నప్పుడు అభ్యర్థులు పెద్దగా బాధపడరు. కాని ఒకటి, రెండు ఓట్లు, పది పాతిక ఓట్ల తేడాతో అక్కడక్కడా ఓడిపోతుంటారు. అలాంటి ఓటములు అభ్యర్థులను జీవి తాంతం వెంటాడుతుంటాయి. అరె... ఇంకొంచెం బాగా చేసుకుని వుంటే గెలిచి వుండేవాడినేమో, ఇంకో పది లక్షలు ఖర్చు పెట్టుంటే ఈజీగా బయటపడి వుండే వాడినే... ఇంకో వంద ఓట్లకు డబ్బులిచ్చి వుంటే నేనే గెలిచేవాడిని కదా... ఇలాంటి ఆలోచనలు వస్తాయి. అలాంటి పరిస్థి తులు ఎక్కడ వస్తాయోనని వూహించే... ఇప్పుడు అభ్యర్థులు పోస్టల్ బ్యాలెట్‌ల కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలో 22వేల మంది ఉద్యోగులు ఎన్నికల విధు లలో పాల్గొన్నారు. వీరందరికీ ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించింది. నెల్లూరు నగరం, రూరల్, కావలి, గూడూరు నియోజకవర్గాల పరిధిలో ఉద్యోగులు ఎక్కువగా ఉంటారు. వెంకటగిరి, సర్వే పల్లి, సూళ్ళూరుపేట, ఆత్మకూరు, ఉదయ గిరి, కోవూరు నియోజకవర్గాల పరిధిలో కూడా సాలీనా నియోజకవర్గానికి 2వేల మందిదాకా పోస్టల్ బ్యాలెట్ కలిగిన ఉద్యోగులున్నారు. ఉద్యోగులు చాలావరకు పోస్టల్ బ్యాలెట్‌లు తీసుకుని వున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల తరపున ఉద్యో గులే రంగంలోకి దిగి పోస్టల్ బ్యాలెట్లు సేకరిస్తున్నారు. ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఎవరు గెలిచినా తక్కువ మెజార్టీయే అన్న చోట్ల పోస్టల్ బ్యాలెట్‌లకు డిమాండ్ బాగావుంది. ఓటు 3వేల నుండి 5వేల దాకా పలుకుతోంది. ఏ పుట్టలో ఏ పాముందో... ఎన్ని ఓట్లతో గెలుపు రాసి పెట్టుందో.. ఇన్ని కోట్లు ఖర్చుపెట్టి నోళ్ళం.. ఈ పోస్టల్ బ్యాలెట్‌లకు ఇంకొంచెం పెడితే ఏమీ కాదులే అని అభ్యర్థులు కూడా పోస్టల్ బ్యాలెట్‌లను తెగ కొనేస్తున్నారని తెలుస్తోంది.

## కొత్త ప్రభుత్వంపై...
# కోటి ఆశలతో రియల్టర్లు



రియల్ ఎస్టేట్... ఆర్థిక లావా దేవీలకు పెద్ద వేదిక. మార్కెట్‌లో దీని ప్రభావం చాలా వుంది. రియల్ ఎస్టేట్ అనే ఒక రంగం మొదలయ్యాకే దేశ ఆర్థిక వ్యవస్థలో వూహించని వేగం వచ్చింది. ట్రేడింగ్ పెరిగింది. ఆర్థిక లావాదేవీలు వూపందుకున్నాయి. రిజిస్ట్రేషన్లు, లేఅవుట్లు వంటి ప్రక్రియ ద్వారా ప్రభుత్వ ఆదాయాలు పెరిగాయి. అన్నింటికి మించి అతిపెద్ద ఉపాధి కల్పనా రంగంగా రియల్‌ఎస్టేట్ మారింది. నిరుద్యోగులు ఖాళీగా లేకుండా రియల్ ఎస్టేట్ రంగంలో ఏదో ఒక పని చేసుకుంటూ బ్రతుకుతున్నారు. ఇక రియల్‌ఎస్టేట్‌కు అనుబంధంగా ఎన్నో వ్యాపారాలున్నాయి. ఇసుక, ఇటుక, పెయింట్స్, హార్ట్‌వేర్స్, గృహోపకరణాలు, ఇనుము... ఒకటేమిటి 50కిపైగా వ్యాపార రంగాలకు రియల్ ఎస్టేట్ అనుసంధానమై వుంది.

ఇంతటి ప్రాధాన్యతగల రియల్ ఎస్టేట్ రంగం నెల్లూరు జిల్లాలో గత ఎనిమిదేళ్ళుగా నిద్రాణ అవస్థలో వుంది. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత జిల్లాలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా పడిపోయింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రియల్‌ఎస్టేట్ అసలు కోలుకోలేనంతగా తయారైంది. గత అయిదేళ్ళుగా జిల్లాలో రియల్ రంగానికి ఊపు, ఉత్సాహం లేదు. ప్రభుత్వ పరంగా కూడా ఎలాంటి ప్రోత్సాహకర చర్యలు లేవు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడడం, కొత్త ప్రాజెక్టులు రాకపోవడం వంటివి రియల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇటీవలే జిల్లాలో రియల్ ఎస్టేట్‌లో కొంచెం కదలిక మొదలైంది. అయితే జిల్లా రియల్టర్ల ఆశలన్నీ కూడా కొత్తగా ఏర్పడే ప్రభుత్వం మీదే! మళ్ళీ తెలుగు దేశమే అధికారంలోకి వస్తే రియల్టర్ల పని పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లే! గత ఐదేళ్ళకు రాబోయే ఐదేళ్ళకు పెద్ద తేడా వుండదు. అదే గనుక వైసిపి అధికారంలోకి వస్తే జిల్లాలో మళ్ళీ రియల్‌ఎస్టేట్ ఒక ఊపు వూపొచ్చు. వ్యాపారుల్లో ఆ విధమైన ఫీలింగ్ ఉంది. కాబట్టి కొత్తగా ఏర్పడే ప్రభుత్వం మీదే నెల్లూరు రియల్టర్లు కోటి ఆశలు పెట్టుకుని ఉన్నారు.

## కనువిందుగా...
# శ్రీ వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు




నెల్లూరు మూలాపేటలో కొలువైఉన్న శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 14న అంకురార్పణతో మొదలయ్యాయి. 15వ తేదీన ధ్వజారోహణ, శేష వాహనం, 16వ తేదీన సూర్యప్రభ, హంస వాహనం, 17న యాళి ఉత్సవం, అలాగే రాత్రి రుక్మిణి–సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలుని చంద్రప్రభ వాహనోత్సవం వైభవంగా జరిగాయి. 18వ తేదీన చప్పరము, వెండి హనుమంత సేవ ఉత్సవాలు జరిగాయి. ఎంతో కనువిందుగా జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సంపత్‌స్వామి, శ్రీనివాస అయ్యంగార్, చైతన్య అవధాని ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న గిన్నెభిక్ష, గరుడ సేవ, 20వ తేదీన స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం, 21వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రికి పుష్పక విమానం అలంకారం, 22వ తేదీన వెన్నతాళి, రాత్రికి అశ్వవాహనం, 23వ తేదీన తీర్థవాది, రాత్రి పొన్నవాహనోత్సవం జరుగనున్నాయి. 24వ తేదీ ఉదయం చక్రస్నానం, రాత్రికి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్స వాల సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం ప్రముఖ ఉపన్యాసకులు ఆలూరు శిరో మణిశర్మచే శ్రీ భాగవత ప్రవ చనాలు ఏర్పాటు చేశారు. అలాగే పలు కళాసంస్థలు సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులను అలరిస్తున్నాయి. దేవస్థానం వ్యవస్థాపక ధర్మ కర్తల మండలి ఛైర్మెన్, మేనే జింగ్ ట్రస్టీ మన్నెం లక్ష్మీనాధ్ రెడ్డి, మేనేజర్ గిరికృష్ణ ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.



# ఎండిపోతున్న.. సోమశిల జలాశయం

## ➢ దాహార్తితో విలవిలలాడుతున్న గ్రామాలు



జిల్లా ప్రజలకు, రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల జలాశయం వర్షాభావ పరిస్థితులతో అడుగంటి పోతోంది. భూగర్భజలాలు అడుగంటి పోతుండడం, పైతట్టు ప్రాంతాల నుంచి కూడా నీరు రాకపోవడంతో సోమశిల జలాశయంలోనూ నీరు బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం కేవలం 4.684 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. అయితే, పక్కనే జలాశయం ఉన్నా ఆ ప్రాంతాలోని గ్రామాలకు తాగునీరు దొరక్క ప్రజలు నిత్యం నానా ఇబ్బందులు పడుతుండడం విచారకరం. అసలే వేసవికాలం..ఎక్కడా చుక్కనీరు కనిపించకపోతుండడంతో అనేక గ్రామాల ప్రజలు దాహార్తితో బాధలు పడుతున్నారు. ఈ వేసవి ఇంకా నాలుగునెలల దాకా మండిపోతుంది కనుక, రానున్న రోజులు మరింత గడ్డుకాలంగా ఉండబోతుంది. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టిసారించి గ్రామాల్లోని ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రత్యామ్నాయమార్గాలను అన్వేషించాల్సి ఉంది. మరోవైపు మూగజీవాలు కూడా నీటికోసం కటకటలాడుతున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఆయా గ్రామాల్లో నీటికొరత తీర్చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఆనందోత్సాహాలతో...
# శ్రీరామనవమి వేడుకలు

- రామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కన్నులపండువగా సీతారాముల కల్యాణోత్సవం

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 14న జిల్లాలోని రామాలయాలు, వైష్ణవాలయాల్లో ఎంతో వేడుకగా ఉత్సవాలు జరిగాయి. ఆయా దేవస్థానాల్లో కొలువైవున్న స్వామివార్లకు ప్రత్యేక పూజలు, విశేష సేవలు చేశారు. ప్రత్యేకించి అనేక ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. జై శ్రీరామ్..అంటూ భక్తులు పెద్దఎత్తున నామజపం చేశారు. శ్రీరామ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. అనేకచోట్ల ఆలయాల నిర్వాహకులు ఈ పర్వదినాన భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో

నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో శ్రీ సీతారాముల కల్యాణం నయనా నందకరంగా జరిగింది. టిటిడి కల్యాణమండపం ఎదురుగా ఉన్న శ్రీరామకోటి మహాయజ్ఞస్థూపం ప్రాంగణంలో జరిగిన ఈ కల్యాణవేడుకను తిలకించ డానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.వెంకటకృష్ణయ్య-పద్మావతి దంపతులు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు రొంపిచెర్ల భావనాచార్యులు నేతృత్వంలో వేదపండితులు, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారికి పూజలు చేసి, ఎంతో వేడుకగా సీతారాముల కల్యాణం నిర్వహిం చారు. అనంతరం వేలాదిమంది భక్తులు రాసిన రామకోటి నామ పుస్తకాలను శ్రీరామకోటి మహాయజ్ఞ స్థూపంలో నిక్షిప్తం చేశారు. శబరి శ్రీరామక్షేత్రం వారి ఆధ్వర్యంలో భక్తులకు ముత్యాల తలంబ్రాలు, అక్షతలు, మంగళసూత్ర దారాలను పంపిణీ చేశారు. అనంతరం, టిటిడి కల్యాణమండపంలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. తిరుపతికి చెందిన శ్రీజ మిల్క్ ప్రోడక్ట్స్ సంస్థ మేనేజర్లు ధరణికుమార్, సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వామి వార్ల కల్యాణోత్సవానికి పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, శ్రీశైల దేవస్థానం ధర్మ కర్తలమండలి సభ్యులు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాజు, రఘునాధరాజు, కారంపూడి శ్రీనివాసులురెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, దద్దోలు రమణయ్య, ఎరబోలు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ మందిరంలో



నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఆలయ అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ లక్ష్మణ శ్రీ ఆంజనేయస్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం లేకపోతే మానవజాతికి మార్గనిర్దేశనం లేదన్నారు. మానవజీవితంలో ఎలాంటి విలువలు పాటించాలి, ఎలాంటి ఆశయాలతో జీవించాలి వగైరా విషయా లన్నీ శ్రీరామచంద్రుని జీవితం నుంచి నేర్చుకోవా లన్నారు. రామో.. విగ్రహవాన్ ధర్మ: అన్నట్లుగా ధర్మబద్ధమైన జీవితానికి శ్రీరాముడు నిలువెత్తు నిదర్శనమన్నారు. అనంతరం వాల్మీకి రామాయణం నుంచి రామకథను వినిపిస్తూ, సీతారామచంద్రులను కీర్తించారు.

## వేడుకగా కల్యాణోత్సవాలు

నెల్లూరులోని అనేక రామాలయాల్లో సీతారామ కల్యాణోత్సవాలు వేడుకగా జరిగాయి. వేదాయపాళెం జ్యోతినగర్‌లోని సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కోదండం వరదరాజ పెరుమాళ్ ఆధ్వర్యంలో వేదపండితులు, ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వర్తించారు. స్థానిక ప్రముఖులు రమణయ్య, మాధవరెడ్డి, రాంబాబు తదితరుల పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. అదేవిధంగా వేదాయ పాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో స్వామివార్లకు తొలుత తిరుమంజనం నిర్వహించి ఊంజల్‌సేవ, శేషవాహ నోత్సవాలను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. జి.మస్తానయ్య, కృష్ణవేణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, త్యాగరాజ సేవాసమితి సభ్యులు పర్యవేక్షించారు. వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణమందిరంలో టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ సౌజన్యంతో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు.

# ఈ రు'బాబే'ంది?

(మొదటి పేజీ తరువాయి)

కొత్తవాటిని పెట్టి పోలింగ్ ప్రారంభించడానికి రెండు మూడు గంటలు ఆలస్యమైందని, దీనిమూలంగా రాష్ట్రంలో చివరి ఓటు వేయడం పూర్తయ్యేసరికి తెల్లారుజామున నాలుగు గంటలయ్యిందన్నది చంద్రబాబు వాదన. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందంటూ కారాలు మిరి యాలు నూరుతున్నారు. ఈవిఎంల మొరాయింపుతో ఇంటికెళ్ళిన మహిళలు మధ్యాహ్నం తాను ఇచ్చిన పిలుపుతో పోలింగ్ బూత్‌లకు తండోపతండాలుగా వచ్చారని, తన పట్ల విశేష ఆదరణ చూపారని ఆయనే చెప్పుకుంటున్నారు. ఇంకోపక్క మాత్రం ఈవిఎంలతో ఎన్నికలు వద్దని, బ్యాలెట్ విధానమే కావాలంటూ ఢిల్లీకి చేరి రచ్చచేశారు. ఈ విషయంలో తన ఆలోచన లకు దగ్గరగా వుండే పార్టీల మద్దతు కూడగడుతు న్నారు. ఈవిఎంలలో ట్యాంపరింగ్ జరుగుతుందని, కాబట్టి బ్యాలెట్‌ను పెట్టాలన్నది చంద్రబాబు డిమాండ్. మరి అదే నిజమైతే 2014లోనూ ఈవిఎంల ద్వారానే ఎన్నికలు జరిపారు. ఆ ఏడాదే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను ఈవిఎంల ద్వారానే జరిపారు. అంతెందుకు ఏడాదిన్నర క్రితం నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నిక కూడా ఈవిఎంల ద్వారానే నిర్వహించారు. అన్ని ఎన్నికల్లో తెలుగుదేశమే గెలిచింది. మరి ఈవిఎంలను ట్యాంప రింగ్ చేసే తెలుగుదేశం గెలిచిందా? కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ చెప్పుచేతల్లో వుందని చంద్రబాబు ఆరోపణ. అదే నిజమైతే, మొన్న కర్నాటక, నిన్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో ఆ పార్టీ ఎందుకు ఓడిపోతుంది.

## ఆ రచ్చ దేనికి సంకేతం

రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగి పోయాయి. గత చరిత్రను పోల్చి చూస్తే ఈ ఎన్నికల్లో జరిగిన హింస చాలాతక్కువే! ఈవిఎంల ద్వారా పోలింగ్ కాబట్టి చిన్నచిన్న సమస్యలు సహజమే. రాత్రయినా ఓటర్లు పోలింగ్‌బూత్‌లలో నిలబడి ఓట్లేసారంటే అది వారిలో కలిగిన చైతన్యం. ఓటును ఖచ్చితంగా వేయాలనే సంకల్పం. నెలలో ఎన్నోసార్లు రేషన్ కోసమో, కరెంట్ బిల్లు కట్టడం కోసమో, గుడిలో దేవుడి దర్శనం కోసమో క్యూలలో గంటలకొద్ది నిలబడతారు. అలాంటిది అయిదేళ్ళకోసారి వచ్చే ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కోసం ఆ మాత్రం 'క్యూ'లో నిలబడలేమా అని అందరూ భావించారు. అంతేగాని ఏ ఒక్క ఓటరు అసహనం వ్యక్తం చేయలేదు. ఎన్నికల నిర్వహణపై అసంతృప్తి చెందలేదు. నేను ఒకరికి ఓటేస్తే ఇంకొకరికి పడిం దంటూ వ్యాఖ్యలు చేయలేదు. ప్రపంచానికే టెక్నా లజీని పరిచయం చేసిన చంద్రబాబు మాత్రమే తాను వేసిన ఓటు ఎవరికి పడిందో తెలియదంటూ వ్యాఖ్యా నించి తన సీనియార్టీకే తలవంపులు తెచ్చుకున్నాడు.

## ఈసీపై అంత కోపమెందుకో?

చంద్రబాబు ఓ పక్క 130సీట్లు వస్తాయంటు న్నాడు... అవి 150 కూడా కావచ్చంటున్నాడు. మే23 తర్వాత మంచిరోజు చూసుకుని ప్రమాణస్వీకారం అంటున్నాడు. గెలుపుపై అంత ధీమా వున్నప్పుడు ఈసీపై ఇంత రచ్చ చేయడమెందుకు? ఎన్నికలను వాళ్ళు సమర్ధవంతంగా నిర్వహిస్తేనే కదా ఈయనకు అన్ని సీట్లు వచ్చేది!

ఈసీపై చంద్రబాబు ఎగిరిపడేది అందుకు కాదు... ఎన్నికలకు ముందు చంద్రబాబు వేసుకున్న ప్లాన్‌లన్నింటిని ఎలక్షన్ కమిషన్ చెడగొట్టింది. సిఎస్‌ను మార్చింది... చంద్రబాబు అను'కుల' ఇంటలిజెన్స్ డి.జిని ఇంటికి పంపింది. ముగ్గురు ఎస్పీలతో పాటు ఇంకొందరు పోలీసు అధికారులను బదిలీ చేసింది. ఒక దశలో డిజిపిని కూడా మారుస్తారనే ప్రచారం జరిగింది గాని, ఈసీ ఆయనను నిష్పక్షపాతంగా పని చేయమని గట్టిగా మందలించి వదిలేసింది. ఎన్నికలకు ముందు తనకు అనుకూల అధికారులను మార్చడం చంద్రబాబుకు ఏ మాత్రం మింగుడుపడలేదు. ఆ కోపంతోనే ఆయన ఎన్నికల ముందురోజు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేదిని కలిసి తన ఆక్రోశా న్నంతా బయటపెట్టాడు. తన ఎత్తులు పనిచేయక పోవడం వల్లే ఎలక్షన్ కమిషన్‌పై ఇప్పుడు చిందులు తొక్కుతున్నాడు.

దేశంలో ఏ పార్టీకి, ఏ నాయకుడికి రాని అభ్యంత రాలు, అనుమానాలు చంద్రబాబుకే వచ్చాయి. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఓ పక్క ప్రతిపక్ష వైకాపా సంతృప్తిగానే వుంది. లోపల ఫలితం ఎలా వుందో ఎవరికీ తెలియదు. అయినా ఎన్నికలు జరిగిన తీరు పట్ల వాళ్ళు ఆక్షేపించలేదు. మరి మే23 తర్వాత ప్రమాణస్వీకారానికి సిద్ధమంటున్న చంద్రబాబుకే ఈ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎందుకు అనిపించడం లేదో ఆయనకే తెలియాలి!

# మహిళల మహిమే!

(మొదటి పేజీ తరువాయి)

ఓటింగ్‌కు కసిగా తరలివచ్చారు. ఈ ఎన్నికల్లో పోలింగ్‌బూత్‌ల వద్ద 'క్యూ'లలో నిలబడ్డ ప్రతి ఒక్కరి లోనూ ఓటు వేయాలనే ఆసక్తి కనిపించింది. ఓటుపై చైతన్యం అంటే అది.

ఇప్పుడు ఆ ఓటు చైతన్యం ఏ పార్టీకి చేటు కానుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. గెలుపుపై రెండు ప్రధానపార్టీలు ధీమాగా వున్నాయి. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఓ పక్క 130సీట్లు పక్కా అని చెబుతూనే ఇంకోపక్క ఎన్నికలు సరిగా నిర్వహించలేదంటూ చేస్తున్న హడావిడి చూస్తుంటే ఆ పార్టీ నాయకుల్లోనే అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇంకోపక్క వైసిపి అధినేత, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. ఆయనలో విజయంపై విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోంది.

అయితే అటు టిడిపిలోను, ఇటు వైసిపిలోను పోలింగ్‌లో భారీగా పాల్గొన్న మహిళలు ఎవరి కొంపలు కూలుస్తారన్న అనుమానాలు లేకపోలేదు. తెలుగుదేశం పార్టీకి గెలుపుపై వున్న అతి బలమైన నమ్మకం మహిళలే! తాము ఇచ్చిన పసుపు-కుంకుమ బాగా పనిచేసిందని ద్వాక్రా మహిళలు తండోప తండాలుగా వచ్చి ఓట్లేశారని, అలాగే వృద్ధులపై పింఛన్‌ల ప్రభావం కూడా పని చేసిందని తెలుగుదేశం వారి నమ్మకం. అయితే ఇంకో అనుమానం కూడా లేకపోలేదు. పసుపు-కుంకుమ పొందిన మహిళలం దరూ తెలుగుదేశం పార్టీ వాళ్ళే కాదు, ఇందులో అన్ని పార్టీల వాళ్ళున్నారు. నేను అధికారంలోకి వస్తే ఈ పథకాలను తొలగిస్తానని జగన్ ఎక్కడా చెప్పలేదు. కాబట్టి మహిళలు వైసిపిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. హోల్‌సేల్‌గా మహిళల ఓట్లన్నీ తమకే పడ్డాయనే ధీమా కూడా కనిపించడం లేదు. కాకపోతే మహిళలు ఎక్కువగా తెలుగుదేశం వైపే మొగ్గు చూపారనే ఆశ మాత్రం ఆ పార్టీ నాయకుల్లో కనిపిస్తోంది.

వైసిపిలోనూ మహిళల ఓట్లపై ఆశలున్నాయి. అలాగే అనుమానాలూ వున్నాయి. ఒక్క అవకాశం ఇవ్వండన్న జగన్ పిలుపుకు మహిళలు సానుకూలంగా స్పందించారనే సంకేతాలున్నాయి. అలాగే మహిళల్లో విజయమ్మ, షర్మిలల ప్రచారం ప్రభావం చూపింది. చదువుకునే ప్రతి బిడ్డకు ఏడాదికి 15వేలు ఇస్తానన్న జగన్ హామీ కూడా మహిళల్లోకి చొచ్చుకు పోయింది. ఈ దిశగా మహిళల ఓట్లు వైసిపికి పడుంటాయనే ఒక నమ్మకం... అదే సమయంలో చంద్రబాబు పసుపు - కుంకుమ పనిచేసి తెలుగుదేశంకు మెజార్టీ మహిళల ఓట్లు పడ్డాయనే ఒక అనుమానం.

అయితే మహిళల ఓట్లపై తెలుగుదేశం పూర్తిగా ఆధారపడితే... వైసిపి మాత్రం అన్ని వర్గాల ఓట్లపై నమ్మకం పెంచుకుంది. మరి మహిళలు ఎవరి ఆశలు నిలుపుతారో? ఎవరి అనుమానాలను నిజం చేయ నున్నారో...? ఇక నెలరోజుల్లో చూద్దాం!

# పట్టు వస్త్రాల రంగంలో పట్టు సాధించిన
# వి.ఆర్.కె. శిల్క్స్





## మే 2న నెల్లూరులో ప్రారంభం

నాణ్యతా ప్రమాణాలే లక్ష్యం. నాన్న చూపిన మార్గమే ఆదర్శం. మహిళా మణుల ఆదరణే అండదండగా వెరసి వస్త్ర ప్రపంచంలో 4 దశాబ్దాల ప్రస్థానం.

చిన్న సంస్థగా ప్రారంభమై అంచెలం చెలుగా ఎదిగి, నేడు భారతదేశమంతా విస్తరించిన సంస్థ కళానికేతన్ శిల్క్స్ ప్రైవేట్ లిమిటెడ్. ముఖ్యంగా మహిళా లోకపు అభిరుచులను ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ తమను తాము ఆధునీకరించు కుంటూ సరిక్రొత్త డిజైన్లు కావాలన్నా ఎక్కడా దొరకని ప్రత్యేక పట్టుచీరలు కొనాలన్నా వి.ఆర్.కె. శిల్క్స్‌కి వెళ్ళాల్సిందే అన్నంతగా మహిళలను ప్రభావితం చేసేంతగా తమ కళానికేతన్ అనుబంధ సంస్థ వి.ఆర్.కె. శిల్క్స్‌కు మంచి గుర్తింపును సాధించింది సంస్థ యాజమాన్యం.


మహిళా లోకానికి పెళ్లిచూపులు మొదలు, నిశ్చితార్థం, పెళ్లి, రిసెప్షన్ వంటి అన్ని వేడుకలకు కావలసిన విస్తృతశ్రేణి పట్టువస్త్రాలను తమ వద్ద అందుబాటులో వుంచడంతో పాటు తమ వద్ద లభించే డిజైన్లను మరెక్కడా లభించకుండా డిజైనర్ తరహాలో పట్టు వస్త్రాలను తయారు చేయడంలోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు వి.ఆర్.కె.శిల్క్స్ వారు.

మహానగరాలకే పరిమితమైన వి.ఆర్.కె.ని త్వరలో నెల్లూరులో ప్రారం భించబోతున్నారు. పట్టువస్త్రాల అమ్మ కంలో మార్కెట్లో ఎన్నో రకాల బ్రాండ్‌లు వున్నప్పటికీ విఆర్‌కె శిల్క్స్ సాధించిన ప్రత్యేకత వేరని, తమ సంస్థలో తయారయ్యే డిజైన్లు తామే స్వయంగా నిపుణుల చేత తయారు చేయించి నేయించిన వస్త్రాలు కాబట్టి ఇలాంటి వెరైటీలు మార్కెట్లో ఎక్కడా లభించవని సంస్థ సారథి వి.నాగభూషణం అంటున్నారు. తమ నూతన స్టోర్‌లో కాంచీపురం, బెనారస్, పైథానీ, పటాన్ పటోలా, లెనిన్, గద్వాల్, రియల్‌జరీకోట, ఉప్పాడ, ఇక్కత్, చాందిని శిల్క్, చాప శిల్క్ వంటి అపురూపమైన, అద్వితీయమైన పట్టువస్త్రాలు అందరికీ అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు.

మాగుంట లే అవుట్ ప్రాంతంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు మినీబైపాస్ రోడ్డు(రాజీవ్ రహదారి)లో బెజవాడ గోపాలరెడ్డి విగ్రహానికి ఎదురుగా మే 2వ తేదీ గురువారం ఉదయం తమ పూర్తిస్థాయి విఆర్‌కె శిల్క్స్‌ను రెండు అంతస్తుల్లో ప్రారంభించబోతున్నామని ఆయన తెలిపాడు. పట్టువస్త్రాల ప్రపంచం లోనే తలమానికమైన ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌గా తీర్చిదిద్దుతున్నామని, నెల్లూరు మహిళా మూర్తులకు సరిక్రొత్త కానుకగా అరుదైన వేదికగా నెల్లూరు విఆర్‌కె శిల్క్స్‌ను అందించబోతున్నామని ఆయన చెప్పారు. ఆల్ ది బెస్ట్ టు విఆర్‌కె.





శ్రీ మేడా వెంకురెడ్డి గారు

## ఉత్తరక్రియలు

మనసున్న మంచి మనిషి,
మా తమ్ముడు
**శ్రీ మేడా వెంకురెడ్డి గారు**
తేది 08-04-2019 సోమవారం పరమపదించారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

### ఉత్తరక్రియలు

నిలుపు: తేది 23-04-2019 మంగళవారం రాత్రి
పెద్దకర్మ: తేది 24-04-2019 బుధవారం ఉదయం
నెల్లూరుజిల్లా, వాకాడు గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com